
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 31 జనవరి 2025

సూపర్‌సిక్స్ పథకాలు తప్పక అమలు చేస్తాం : మంత్రి మండిపల్లి


రాయచోటిలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమపై చూపిన నమ్మకం మేరకు సూపర్‌సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల అరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడు నెలల కాలంలోనే ప్రజలు సుఖసంతోషాలతో కాలం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలో తాము ఎవరిపైనా కక్షసాధింపులు చేయలేదని, ఇక మీదట కూడా ఎవరి మీద కక్ష సాధింపులు చేయమన్నారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పరిపాలించాడని, ఆయన ఒక విజన్ గల నాయకుడని, ఆయనను ప్రశ్నించే అర్హత, హక్కు పెద్దిరెడ్డికి లేదన్నారు. మీరు ఐదు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి, మేము ఏడు నెలల్లో చేసిన అభివృద్ధికి పోల్చి చూస్తే ఎన్నో రెట్లు ఎక్కువ అభివృద్ధి కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన తర్వాత రాష్ట్రంలోని మూడు మెగా ప్రాజెక్టులకు ఫండింగ్ ఇచ్చారన్నారు. అందులో పోలవరం, అమరావతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు 45 వేల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రధాని నరేంద్రమోదీ మంజూరు చేశారన్నారు. ఉపాధి హామీ పథకంలో ఎన్నో అక్రమాలు, అన్యాయాలు చేసి పేదల సొమ్మును దోచుకున్నది వైసీపీ నాయకులు కాదా అన్నారు. రాబోయే రోజుల్లో గతంలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ తప్పకుండా అమలు చేస్తామని, అప్పటికే గతంలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామన్నారు. త్వరలో డీఎస్సీ పరీక్ష నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మళ్లీ అధికారంలోకి తామే వస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ

- నివేదిక ఇవ్వాలంటూ లోకాయుక్త ఆదేశాలు
- విచారణాధికారిగా కర్నూలు డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు
- బి.కొత్తకోటలో అన్యాక్రాంతమైన దేవుడి మాన్యం భూముల పరిశీలన


6

అరకోటి నొక్కేశారు..!



- 15వ ఫైనాన్స్ నిధులలో చేతివాటం
- ఒంటిమిట్టలో రూ.27,93,367 గోల్‌మాల్
- తొండూరులో రూ.22 లక్షలు హాంఫట్
- సుండుపల్లెలో నిబంధనలకు విరుద్ధంగా రూ.5 లక్షలు చెల్లింపు
- మొత్తం రూ.55 లక్షల ప్రభుత్వ నిధులు మాయం
- అవినీతి ఉద్యోగులలో దడ
- ఎంపీడీవో కార్యాలయాలలో అలజడి

కడప రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఎంపీడీవో కార్యాలయాలు అక్రమాలకు నిలయాలుగా మారాయి. జనరల్ ఫండ్ నిధులతో పాటు 15 వ ఫైనాన్స్ నిధులను పెద్దఎత్తున దారి మళ్లించారు. లక్షల నిధులను అప్పనంగా మింగేశారు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు పంచుకుని తినేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ అవినీతి భాగోతాలు ఒక్కోటి బట్టబయలు అవుతున్నాయి. దీంతో అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. కాజేసిన నిధులను కక్కించేందుకు విచారణకు ఆదేశించింది. ఒంటిమిట్ట, తొండూరు, సుండుపల్లె మండల్లాలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాన్ని నిగ్గుతేల్చేందుకు విచారణకు ఆదేశించింది. అడ్డదారుల్లో స్వాహా చేసిన ప్రభుత్వ నిధులను తిరిగి రాబట్టడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తోంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది.

ఒంటిమిట్టలో రూ.27,93,367 గోల్‌మాల్

వైసీపీ పాలనలోని 2023-24 మధ్యకాలంలో ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయంలో దాదాపు రూ.27,93,367 మేర 15వ ఫైనాన్స్ నిధులు గోల్‌మాల్ అయ్యాయని సమాచారం. ఈ నిధులలో రూ.11.56 లక్షలు, అలాగే రూ.1.85 లక్షల మేర రెండు దఫాలుగా పంచాయతీ కార్యాలయంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న ఓబులశెట్టి జనార్ధన్ ఖాతాలోకి అక్రమార్కులు బిల్లుల రూపంలో జమచేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని జనార్ధన్ తన ఖాతా నుంచి సీనియర్ అసిస్టెంట్ జి.వరప్రసాద్‌కు, కంప్యూటర్ ఆపరేటర్ ఆలీ బేగ్‌కు పంపినట్లు తెలిసింది. రూ.27.93లక్షల్లో వీరు నొక్కేసిన రూ.13.41లక్షలు పోను మిగిలిన మొత్తానికి కూడా ఎం.బుక్కులు లేవని అంటున్నారు. కాగా.. ఎంపీడీవో, పంచాయతీ సర్పంచ్‌కు సంబంధించిన డిజిటల్ కీని కంప్యూటర్ ఆపరేటర్ ఆలీబేగ్ ఇవ్వడంలేదని.. ఆలీబేగ్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్ ఈ నెల 22 నుంచి విధులకు రావడంలేదని ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ

ఒంటిమిట్ట మండలంలో చోటుచేసుకున్న 15వ ఆర్థిక సంఘం నిధుల గోల్‌మాల్‌పై కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీశాఖ విచారణ చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి (జమ్మలమడుగు డీఎల్‌డీవో) సుబ్రమణ్యంకు విచారణ బాధ్యతలు అప్పగించారు. ఆయన రెండు రోజుల క్రితం విచారణ చేపట్టారు. మంజూరైన నిధులు.. కేటాయింపులు.. చేపట్టిన పనులు.. ఎం.బుక్‌లు.. పాస్‌బుక్‌లు.. నగదు పుస్తకం.. ఓచర్లు తదితర వాటిని పరిశీలించారు. ఈ మేరకు రూ. 11.56 లక్షలు, అలాగే రూ.1.85 లక్షలు మేర మొత్తం రూ.13.41లక్షలు అక్రమంగా చెల్లించినట్లు నిర్ధారించినట్లు సమాచారం. తన ఖాతాలోకి వచ్చిన ఆ సొమ్ములను సీనియర్ అసిస్టెంట్ పి.వరప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ ఆలీబేగ్‌కు పంపినట్లు ఫిట్టర్ తిరుమలశెట్టి జనార్ధన్ విచారణాధికారులకు లిఖితపూర్వకంగా తెలిపారని సమాచారం.

తొండూరులో రూ.22 లక్షల చేతివాటం

తొండూరు మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.22 లక్షల వరకు చేతివాటాన్ని ప్రదర్శించి అప్పనంగా తినేశారు. ఎంపీడీవోలకు ఓటీపీ రాకుండా ఎల్‌సీవోలు మేనేజ్ చేశారు. సదరు నిధులను కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా థర్డ్ పార్టీకి పేమెంట్ చేసి అక్కడ నుంచి తినేశారు. ఈ వ్యవహారంపై పులివెందుల డీఎల్‌డీవో శ్రీనివాసులును విచారణ అధికారిగా నియమించారు.

సుండుపల్లెలో. రూ.5.23 లక్షలు..

అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలంలో నిబంధనలకు విరుద్ధంగా స్ట్రీట్‌లైట్లకు రూ.5.23 లక్షలు మండల పరిషత్ నిధులు చెల్లించి సొమ్ముచేసుకున్నారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారులకు భయం పట్టుకుంది.

ఎంపీడీవో కార్యాలయాలలో అలజడి

మండల పరిషత్ కార్యాలయాలకు మంజూరైన 15వ ఫైనాన్స్ నిధులలో చేతివాటంపై ఒట్టిమిట్ట, తొండూరు, సుండుపల్లె మండలాల్లో విచారణ జరుగుతుండడంతో ఉమ్మడి కడప జిల్లాలోని పలు ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న అవినీతి ఉద్యోగులలో అలజడి మొదలైంది. ఇప్పటికే ఒంటిమిట్టలో రూ.27,93,367లు, తొండూరులో రూ.22.23 లక్షలు, సుండుపల్లెలో రూ.5 లక్షల మేర గోల్ మాల్ జరిగినట్లు గుర్తించి బాధ్యులపై చర్యలకు ఉపక్రమించారు. కేవలం 3 మండలాల్లోనే అరకోటికి పైగా నిధులను తినేసినట్లు అధికారుల విచారణలో లెక్కతేలింది. అన్ని మండలాల్లో విచారణ జరిపితే అధికారులు నొక్కేసిన సొమ్ము రూ.కోట్లల్లో ఉంటుందని ఆ శాఖ ఉద్యోగులే అంటున్నారు. దీంతో ఇతర మండలాల్లో కూడా 15వ ఆర్థిక సంఘం నిధుల అవకతవకలకు ఆస్కారం కల్పించిన అధికారులలో దడ మొదలైంది.



అవినీతి ఉద్యోగులపై కేసులు..



ఆయా మండల కార్యాలయాల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశించాం. ఒంటిమిట్ట మండలంలో రూ.27,93,367లు, తొండూరు మండలంలో రూ.22 లక్షలు, సుండుపల్లెలో రూ.5 లక్షలు మొత్తం రూ.55 లక్షల వరకు గోల్‌మాల్ జరిగింది. ఇందులో తొండూరులో 80శాతం వరకు రికవరీ చేశాం. అలాగే సుండుపల్లె మండలంలో నిబంధనలకు విరుద్ధంగా చెల్లించిన రూ.5లక్షలు తిరిగి వసూలు చేశాం. ఇందుకు బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు చట్టపరంగా కేసులు ఫైల్ చేస్తున్నాం.

- ఓబులమ్మ, జడ్పీ సీఈవో

సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- సమన్వయంతో పర్యటన విజయవంతం చేయాలి : కలెక్టర్ శ్రీధర్


హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్, తదితరులు

సంబేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి మంత్రి సంబేపల్లె మండలంలో సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా ప్రకాశ్‌నగర్‌కాలనీ సమీపంలో గల హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం, ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటి పథకానికి చేయనున్న ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సంత రోడ్డు మార్గంలో ఉన్న బొగ్గులవారిపల్లె దళితవాడలో పింఛన్ లబ్ధిదారులైన కొప్పుల మంగమ్మ, బీసీ కాలనీలో గొల్ల వెంకటేశ్వర్లు గుర్తించారు. సచివాలయం ఎదురుగా సమావేశం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంబేపల్లె మండలంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, ముఖ్యమంత్రి సంబేపల్లెకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేద్దామన్నారు. పింఛన్ల పంపిణీలో ప్రజలకు, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా పింఛన్లు అందుకునే లబ్ధిదారులను, వారి వివరాలను అధికారులు మంత్రి, కలెక్టర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, అర్చనా విద్యాసంస్థల అధినేత మదన్ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, ఎంపీడీవో రామచంద్ర, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం ఉండవల్లి నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి కడప ఎయిర్‌పోర్టుకు 11.55 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.20 గంటలకు సంబేపల్లె ప్రకాశ్‌నగర్‌కాలనీ సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.40 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సంబేపల్లెకు చేరుకుని అక్కడ ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రారంభిస్తారు. 1.30 గంటలకు వరకు రిజర్వ్. 1.30 నుంచి 1.45 వరకు ప్రజలతో సమావేశమవుతారు. 1.50 నుంచి 2.20 గంటల వరకు సంతగేటు కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తారు. 2.20 నుంచి 3.20 వరకు స్థానికులతో సమావేశమవుతారు. 3.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

ఏసీబీ వలలో రామసముద్రం ఎస్ఐ

- రూ.70 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు


లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్ఐ వెంకటసుబ్బయ్య

రామసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం ఏసీబీకి చిక్కారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద లారీ యజమాని ఓ కేసుకు సంబంధించి ఎస్ఐకు డబ్బులు ఇస్తుండగా తిరుపతి ఏసీబీ అధికారులు ఎస్ఐను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల మేరకు... ఈనెల 23వ తేదీ మండలంలోని ఏటవాకిలి గ్రామం వద్ద నాయుడుపేట నుంచి చిక్‌బళ్లాపూర్ వెళుతున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ కేసుకు సంబంధించి లారీని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. కాగా లారీని రిలీజ్ చేయడానికి లారీ ఓనర్‌ను ఎస్ఐ రూ.లక్ష లంచం అడగ్గా ఈ విషయం లారీ ఓనర్ ఏసీబీ అధికారులకు తెలిపారు. ఈ నేపథ్యంలో రామసముద్రం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద బాధిత లారీ ఓనర్ ఎస్ఐకు రూ.70 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు ఎస్ఐను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరింత సమాచారం రాబట్టడం కోసం ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి, డీఎస్పీ జెస్సికా ప్రశాంతి బృందం ఎస్ఐను విచారిస్తున్నారు. కాగా సీఐ రమేశ్‌కు కూడా ఇందులో ప్రమేయం ఉందని విచారిస్తున్నట్లు తెలిపారు,

బాల్యవివాహాల రహితంగా తీర్చిదిద్దాలి

- పటిష్టంగా మిషన్ వాత్సల్య, మిషన్‌శక్తి పథకాలు
- బాల్యవివాహాల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలి
- స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి సూర్యకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి సూర్యకుమారి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాను బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి సూర్యకుమారి, ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ శాఖలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రత్యేకాధికారి మాట్లాడుతూ బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. జిల్లాలో అంగన్వాడీ సేవలను మరింత పటిష్టవంతంగా నిర్వహించాలని చెప్పారు. కిశోర వికాసం కార్యక్రమానికి సంబంధించి అంగన్వాడీ, పాఠశాలలు, కాలేజీల్లో సఖి గ్రూపులను, యువ గ్రూపులను ఏర్పాటు చేసి వారంలో ఒకరోజు గ్రూపులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి పథకాలను, కల్పనలో భాగంగా బాత్‌రూంలు, నీళ్ల సదుపాయం, విద్యుత్, ఇతర సదుపాయాలు సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ప్రత్యేక అధికారికి వివరించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఐసీడీఎస్ శాఖ అధికారులు సూపర్‌వైజర్లకు సూచించారు. సర్పంచ్, గ్రామపెద్దలు, బాల్య వివాహ నిషేధ కమిటీల ద్వారా అవగాహన కల్పిస్తూ బాల్యవివాహాల వ్యవస్థను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియా దేవి, ఐసీడీఎస్ కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా ఐసీడీఎస్ అధికారిణి, జీఎస్‌బ్ల్యూఎస్ అధికారి, ఐసీడీఎస్ సీడీపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దశేషవాహనంపై దేవదేవుడు

కడప కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజైన గురువారం రాత్రి 8గంటలకు దేవదేవుడు ఇరువురు దేవేరులతో కలిసి పెద్దశేష వాహనంపై దేవునికడప మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపు ముందు భాగాన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోలాట నృత్య కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను రంజింపజేశారు. అంతకు ముందు ఉదయం 9గంటలకు ప్రధాన అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో దేవునికడప ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దశేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

అక్రమాలపై విచారణ



ఇసుక తరలింపుపై ఈవో మునిరాజును ప్రశ్నిస్తున్న విచారణాధికారి రామాంజనేయులు

- నివేదిక ఇవ్వాలంటూ లోకాయుక్త ఆదేశాలు
- విచారణాధికారిగా కర్నూలు డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు
- బి.కొత్తకోటలో అన్యాక్రాంతమైన దేవుడి మాన్యం భూముల పరిశీలన

బి.కొత్తకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ పరిధిలోని దేవుడి మాన్యం భూముల అక్రమాలపై వెళ్లిన ఫిర్యాదులపై ఎట్టకేలకు అధికారులు కదిలారు. విచారణాధికారిగా నియమితులైన కర్నూలు జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈవో రామాంజనేయులు గురువారం బి.కొత్తకోట చేరుకుని విచారించారు.

బి.కొత్తకోట పట్టణంలోని ఆంజనేయస్వామి, చౌళేశ్వరస్వామి, నల్లగంగమ్మ ఆలయాలకు చెందిన రూ.కోట్ల విలువైన మాన్యం భూముల నిర్వహణలో అక్రమాల కారణంగా ప్రతి యేటా రూ.లక్షల్లో దేవదాయ శాఖకు నష్టం వాటిల్లడమే కాక, విలువైన భూముల్లో ఇసుక తోడివేయడంతో భూమి ధ్వంసం, తదితర ఫిర్యాదులు దేవదాయశాఖ అధికారులతో పాటు రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలంటూ లోకాయుక్త రాష్ట్ర దేవదాయ కమిషనర్‌ను ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు రాష్ట్ర కమిషనర్ విచారణాధికారిని నియమించారు. ఈ అక్రమాలపై గతంలో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.

మాన్యం భూముల్లో తిరిగి..

విచారణాధికారి రామాంజనేయులు బి.కొత్తకోటలోని మాన్యం భూముల్లో తిరిగి ప్రతి అంశాన్ని నేరుగా పరిశీలించారు. రెవెన్యూ అధికారులను రప్పించి భూముల మ్యాప్‌ను పరిశీలించారు. పట్టణ శివారులోని ఆలేటివాగు పక్కనే ఉన్న చెన్నకేశవస్వామి మాన్యంలోని సర్వే నెంబర్-1840, 1726లలో ఇసుక తరలింపు వల్ల ఏర్పడ్డ గుంతలను, లీజు పొందుకున్న వారికి హద్దులు చూపని భూములను, ఏళ్ల తరబడి వేలం వేయని భూములను పరిశీలించారు. బెంగళూరు రోడ్డులోని గంగమ్మ మాన్యం సర్వే నెంబర్-326, 328లలోని 9 ఎకరాల విస్తీర్ణంలో నామమాత్రపు లీజుతో ఇటుకబట్టీలు, నర్సరీ తదితర వాటికి వినియోగించుకుంటున్న ఆరోపణపై భూమికి సంబంధించిన లీజు రసీదుల గురించి నిర్వాహకులను ఆరా తీశారు. తాము 12 ఏళ్లుగా ఉంటున్నామని చెల్లించిన డబ్బుకు ఈ ఏడాది మాత్రమే రసీదు ఇచ్చారని నిర్వాహకులు కమిషనర్‌కు వివరించారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండుగా వాడుకుంటున్న మాన్యం భూమిలో ఏర్పాటు చేసుకున్న బంకుల యజమానులను కమిషనర్ ప్రశ్నించారు. అధికారికంగా అనుమతులు ఇవ్వలేదని, అయినా నెలసరి అద్దె వసూలు చేసుకుంటున్నారని దుకాణదారులు చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మాన్యం భూముల విషయమై చర్చించారు. నిర్దేశించిన సర్వే నెంబర్లకు హద్దులు చూపి, నివేదిక ఇస్తే తాము తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని తహసీల్దార్‌ను డీసీ కోరారు.

నిన్ను చూసి పోవడానికి వచ్చానా..

లోకాయుక్తకు వెళ్లిన ఫిర్యాదులకు సంబంధించి ఆంజనేయ స్వామి ఆలయం, వివిధ ఆలయాల మాన్యం భూముల వద్ద పరిశీలన సమయంలో పలుమార్లు వీటికి సంబంధించిన వివరాలు, రసీదులు ఇవ్వమని విచారణాధికారి బి.కొత్తకోట ఈవో మునిరాజును అడిగారు. ఏమి అడిగినా తన దగ్గర లేవని ఆఫీసులో ఉన్నాయని ఈవో బదులివ్వడంతో డీసీ రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమి లేవంటే ఎలా? అంత దూరం నుంచి నేను నిన్ను చూసిపోవడానికి వచ్చానా అని ప్రశ్నించారు. ఉద్యోగానికి న్యాయం చేయాలని, చేయలేనప్పుడు తప్పుకోవాలని చురకలంటించారు. ఈవోగా ఆరేళ్లుగా పనిచేస్తున్నా ఇటుక బట్టీల వారికి ఒక్క ఏడాది రసీదులు మాత్రమే ఇవ్వడంపై ప్రశ్నించగా ఈవో మౌనం వహించారు.



దేవుడి మాన్యం భూములపై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలు

రాష్ట్ర కమిషనర్‌కు నివేదిక ఇస్తాం..

బి.కొత్తకోట దేవాలయాల మాన్యం భూముల విషయమై వచ్చిన ఫిర్యాదులపై లోకాయుక్త ఆదేశాల మేరకు విచారించాను. నిర్వహణ తీరు లోపభూయిష్ఠంగా ఉన్న మాట వాస్తవమే. రెవెన్యూ అధికారులు భూమి హద్దులు తేలిస్తే ఇసుక తరలింపుపై స్పష్టత వస్తుంది. విచారణలో తేలిన అంశాలతో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపుతాం.

- రామాంజనేయులు, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, కర్నూలు జిల్లా

ఉద్యాన పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

అనంతరాజుపేట ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు



ప్రదర్శనను తిలకిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాస్

రైల్వేకోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని అనంతరాజుపేట అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం డక్కిలిలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం వారు సంయుక్తంగా రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో నాల్గవ సంవత్సరం బీఎస్సీ ఉద్యాన కోర్సు చదువుతున్న విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా డక్కిలి గ్రామంలో 3 నెలలుగా రైతులతో కలిసి ఉద్యాన పంటల సాగును పరిశీలిస్తున్నారని తెలిపారు. తమ విద్యార్థులు పంట సాగులో మెళకువలు నేర్చుకున్నారని, విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై రైతు సదస్సుతో పాటు ఉద్యాన పంటల ప్రదర్శన ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రధానంగా రైతులు ఉద్యాన పంటలను పండించే క్రమంలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పెట్లూరు నిమ్మ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ రైతులకు పంటల సాగు, తెగుళ్ల నివారణలో ఎలాంటి సందేహాలు వచ్చినా శాస్త్రవేత్తలను సంప్రదించాలని తెలిపారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ వై.శిరీషా మాట్లాడుతూ తెగుళ్ల నివారణ, పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డక్కిలి మండల ఉద్యాన శాఖాధికారి ఆనంద్, ఉద్యాన కళాశాల ఏడీఆర్ డాక్టర్ బి.హరి, మల్లికార్జున రెడ్డి, నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త కాందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కుష్ఠువ్యాధిపై అవగాహన



కుష్ఠువ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థిని, విద్యార్థులకు స్పర్శ కుష్ఠు వ్యాధి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు పాల్గొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. సిద్దవటం జడ్పీ హైస్కూల్లో గురువారం జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని, వ్యాధి నిర్మూలనకు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నిర్మూలనకు స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించి తెలియజేశామని, చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్యశాలకు వెళ్లి పరీక్షించుకోవాలన్నారు. అనంతరం కుష్ఠు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి రవిబాబు, వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మీ, పాఠశాల హెడ్మాస్టర్ శ్రీరాములు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామ పంచాయతీగా చేద్దాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సంబేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో భాగంగా సంబేపల్లె గ్రామ పంచాయతీని స్వర్ణ గ్రామ పంచాయతీగా సిద్ధం చేద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో హంగు, ఆర్భాటం లేకుండా ఎక్కడ చెట్లు, కొమ్మలు తొలగించకుండా పరిశుభ్రతతో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు తెలియజేశారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎంపీడీవో, తహసీల్దార్, స్థానిక అధికారులతో కలిసి చర్చించారు. రాష్ట్రంలో 2047 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే లక్ష్యంగా సంక్షేమాన్ని చేపడతామని తెలియజేశారు. సంబేపల్లె స్వర్ణ గ్రామ పంచాయతీ సాధన కోసం 10 సూత్రాల అమలు కోసం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు అభివృద్ధి, సంక్షేమం కోసం వెంటనే చర్యలు చేపట్టాలని తెలియజేశారు. 50 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలియజేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పనితీరు సోలార్ విద్యుత్, యువత వివిధ రంగాల్లో శిక్షణా నైపుణ్యాలు ప్రజల ఆర్థిక జీవన స్థితిగతులను పెంచేందుకు చేపట్టవల్సిన పలు అంశాలపై అధికారులకు తెలియజేశారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



పోలీసు అధికారలాంఛనాలతో అంత్యక్రియలు, శశికుమార్ (ఫైల్)

వాల్మీకిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ పూజారి శశికుమార్ షిర్డీ (51) అంత్యక్రియలు గురువారం పోలీసు అధికార లాంఛనాలతో నిర్వహించారు. వాల్మీకిపురం మండలంలోని ఓబులంపల్లెకు చెందిన సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు పూజారి శశికుమార్ షిర్డీ శ్రీకాళహస్తిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు స్వగ్రామమైన ఓబులంపల్లెలో పోలీసు అధికార లాంఛనాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, స్నేహితులు, బంధువులు శశికుమార్ మృతిపట్ల నివాళులర్పించారు.

పరిశోధనకు అనుమతులివ్వండి

- అటవీశాఖను కోరిన పురావస్తుశాఖ
- లంకమల్లలో అరుదైన చిత్రాలు



లంకమల్లలో బండపై ఉన్న చిత్రాలు

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అడవుల్లో అరుదైన చిత్రాలను పరిశీలించేందుకు భారతీయ పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నం అటవీశాఖ అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. మండలంలోని లంకమల్ల అటవీ ప్రాంతంలో అరుదైన పురాతన చిత్రాలు బయటపడడంతో సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి భారతీయ పురావస్తుశాఖ అధికారులకు జనవరి 23న నివేదిక పంపించారు. రాయలసీమ ప్రాంతమైన లంకమల్ల అటవీ ప్రాంత సిద్దవటంలో లభించడం ఇదే మొదటిసారి అని, రాతి బండలపై శాసనాలు చెక్కబడి ఉన్నాయని, నాలుగో శతాబ్దపు మానవజాడలు తొలిసారిగా లభ్యం కావడంతో లంకమల్ల అడవుల్లో ఇలాంటి పురాతనమైన చిత్రాలు మరెన్నో ఉంటాయని, వీటిని వెలుగులోకి తీసుకొస్తే లంకమల్ల అందాలు పర్యాటకులకు కనువిందుగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై భారతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నంను వివరణ కోరగా అనుమతుల కోసం అటవీశాఖ ఉన్నతాధికారులకు ఈనెల 26వ తేదీ నివేదిక పంపించామని, అనుమతులు రాగానే లంకమల్ల అటవీ ప్రాంతంలో పరిశీలిస్తామని ఆయన అన్నారు.

నీటి ఎద్దడిపై ముందు జాగ్రత్త చర్యలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు



జడ్పీ సీఈవో రవికుమార్‌తో మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు / పెద్దతిప్పసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. ములకలచెరువు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జడ్పీ సీఈవోను కలిశారు. ముందస్తుగా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించిందని, ఈ నిధులు తాగునీటి అవసరాలకు వినియోగించాలని జయచంద్రారెడ్డి సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వచ్చే నెల 7వ తేదీ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని, సహకరించాలని సీఈవోను కోరారు. అనంతరం జడ్పీ సీఈవోను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు శంకర్‌రెడ్డి, కేశవ రెడ్డి, ఫజులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య అనేది రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల అధికారులను చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించాడు గురువారం ఆయన పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.

మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి మండల నిధులను వాటి ఖర్చులను మిగిలిన నిధులను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల గ్రాంట్‌లో ఉన్న నిధులను ముందస్తుగా మండలంలో ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య అనేది రాకుండా చూడాలని వాటికి కావాల్సిన నిధులను వాడుకోవాలని, మంచినీటి సమస్యకు తప్ప ఈ నిధులను ఏ పనికీ వినియోగించరాదన్నారు. మంచినీటి సమస్యలపై ఆలసత్వం వహిస్తే అటువంటి అధికారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, ఏవో నిత్యానంద, టీడీపీ నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, పట్టా చంద్రమోహన్‌రెడ్డి ఆంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

డీకేటీ భూములకు పట్టాలపై విచారణ

కురబలకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివేడు పంచాయతీ పరిధిలో డీకేటీ భూములకు పట్టాలు ఇవ్వడంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'డీకేటీ భూములకు పట్టాలిచ్చేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. ముదివేడు పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్-1630లో దాదాపుగా 4.25 ఎకరాలకు తల్లీ, కొడుకులకు డీకేటీ పట్టాలు ఇవ్వడంపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెక్‌డ్యాంల మాట మరిచారా!

- నదుల నీరు వృథాగా సముద్రంపాలు
- చెక్‌డ్యాంలు నిర్మించాలంటున్న రైతులు




రైల్వేకోడూరులోని ముష్టేరు వద్ద గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలో నిల్వ ఉన్న నీరు

రైల్వేకోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా సముద్రం పాలవుతోందని, చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే కరువు ఉండదని రైతులు వాపోతున్నా ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ముందుచూపుతో చేసిన పనులు నేటికీ ఫలితాలు ఇస్తున్నాయని రైతులు అంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. దక్షిణ భారతదేశంలో అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. రైల్వేకోడూరును మరో కోనసీమ అని కూడా పిలుస్తారు. రైల్వేకోడూరు ప్రాంతంలో ముష్టేరు, గుంజనేరు, గుండాలేరు, పుల్లంగేరు, మేకలగుంతేరు తదితర నదులు ఉన్నాయి. నదులకు సమీపంలో అడవులు ఉన్నాయి. అడవుల్లో కురిసిన వర్షం ఈ నదుల్లోకి వస్తుంది. ప్రతిఏటా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు వృథాగా పోతోంది. నీటికట్టడికి అటు అధికారులు, ఇటు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారు. ప్రతి నదిలో అక్కడక్కడా చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే ఏళ్ల తరబడి నీరు నిల్వ ఉండేది. అయితే చెక్‌డ్యాంలు లేకపోవడంతో నీరు వృథా కావడమే కాకుండా రైల్వేకోడూరు మండలంలోని ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో కరువుఛాయలు కనిపిస్తున్నాయి. గుంజననదిలో 8 చెక్‌డ్యాంలు, గుండాలేరులో 5 చెక్‌డ్యాంలు, మేకలగుంతేరుపై 4 చెక్‌డ్యాంలు, ముష్టేరు నదిపై 8 చెక్‌డ్యాంలు నిర్మిస్తే భూగర్భజలాలు అడుగంటే ప్రసక్తే ఉండదని రైతులు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి ఎటుచూసినా అడవులు ఉన్నాయి. ప్రత్యేకించి శేషాచలం, వెలుగొండ అడవుల నుంచి వర్షాకాలంలో వచ్చే నీరు నదుల్లో కలుస్తుంటాయి. వీటిని సద్వినియోగం చేసుకుంటే రైల్వేకోడూరుకు నీటి కొరత అనేది ఉండదని ఇది వరకే రైతులు ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసి ఉన్నారు. గతంలో తూతూమంత్రంగా చేసిన చెక్‌డ్యాంలు వరదనీటిలో కొట్టుకునిపోయాయి. పక్కా ప్రణాళికతో చెక్‌డ్యాంలు నిర్మిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని రైతులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముష్టేరు నదిపై రాజీవ్ గిరిజన కాలనీకి సమీపంలో చెక్‌డ్యాంను నిర్మించడంతో నేటికీ ఫలితాలు కనిపిస్తున్నాయి. నిర్మించిన చెక్‌డ్యాం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. అదేవిధంగా చెక్‌డ్యాం చుట్టుపక్కల రక్షణ గోడ నిర్మాణం చేశారు. దీంతో రైతుల పొలాలు కోతకు గురి కాకుండా ఉన్నాయి. నీటి నిల్వ ఉండడంతో రైతులకు ఉపయోగకరంగా మారింది. రైల్వేకోడూరు ప్రాంతంలో ఉన్న నదులన్నింటికీ అనుసంధానం చేస్తే రైతులకు మేలు చేసే విధంగా ఉండడమే కాకుండా కరువు అనేది రాదని పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. గత ఏడాది తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు భారీగా నదుల్లో వరద నీరు చేరింది. ప్రస్తుతం ఉన్న నీరంతా వృథాగా పోతోంది. నదులను అనుసంధానం చేసి, చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీటి నిల్వ ఉండడమే కాకుండా ఇటు రైతులకు అటు ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అంటున్నారు.



రైల్వేకోడూరులో గుంజననది నుంచి వృథాగా పోతున్న వరద నీరు (ఫైల్)

అనుసంధానం మాట మరిచిపోయారు



నదుల అనుసంధానం అనే మాటను నేతలు పూర్తిగా మరిచిపోయారు. గతంలో నదులను అనుసంధానం చేసి వాటిపై చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే నీటి నిలువ ఎప్పుడూ ఉండేది. చెక్‌డ్యాంల నిర్మాణాలు చేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారు. అందువల్లే నేడు వచ్చిన నీరు సముద్రంపాలు కాక తప్పలేదు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించి నదులను అనుసంధానం చేయాలి.

- సాధు శివరామయ్య, ఆదర్శ రైతు, మైసూరివారిపల్లె

నీటిని నిల్వ ఉంచాలి



నీటిని నిల్వ ఉంచే ప్రయత్నాలు చేయాలి. వర్షాలకు నదుల్లోకి భారీగానే వరద నీరు వస్తుంది. కానీ ఆ నీటిని నిలబెట్టుకునే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తే అటు రైతులకు, ఇటు ప్రజలకు మేలు కలుగుతుంది. లేదంటే వచ్చిన నీరంతా వచ్చినట్లే పోతుంది. పాలకులు మంచి నిర్ణయాలు తీసుకుంటే నీటి నిల్వ వల్ల రైల్వేకోడూరు నియోజకవర్గం ఇంకా సస్యశ్యామలం అవుతుంది.

- ఉంగరాల క్రిష్ణ, ఆదర్శ రైతు, రైల్వేకోడూరు

రూ.1.40 కోట్లు వృథా



విద్యార్థులు భోజనం చేసేందుకు ఉపయోగపడని కిచెన్ షెడ్డు



బ్రాహ్మణపల్లె పాఠశాలలో ఎండలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

- అలంకారప్రాయంగా డైనింగ్ హాల్స్
- కనిపించని ఆర్వో ప్లాంట్లు, కిచెన్ షెడ్లు
- చెట్ల కింద, ఎండలో భోజనం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం... కార్పొరేట్‌స్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు విద్యతో పాటు సదుపాయాలు కల్పిస్తాం అని గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఆర్భాటపు ప్రకటనలు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వసతులు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారు. దీంతో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు పెద్ద డైనింగ్ హాల్స్ నిర్మించి.. అందులో టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసేందుకు భారీగా నిధులు వెచ్చించారు. ఇందుకోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్‌ఈసీ) వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద పులివెందులలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్‌తో పాటు ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 2020 సెప్టెంబర్ 21న ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ మరియు వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. ఒక్కో పాఠశాల వద్ద కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంట్ నిర్మాణానికి దాదాపు రూ.28లక్షలు ఖర్చు చేశారు. ఈ పనులు 31.03.2023 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే పనులు పూర్తి కాకుండానే 19-01-2024 తేదీ నాటికి ఆర్‌ఈసీ సంస్థకు బిల్లులు చెల్లించారు.



బ్రాహ్మణపల్లె పాఠశాలలో డైనింగ్ హాల్‌లో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

అలంకారప్రాయంగా...

పులివెందుల పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల (నల్లపురెడ్డిపల్లె), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సత్రం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రవీంద్రనాధ), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికల), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బ్రాహ్మణపల్లె)ల్లో నిర్మించిన డైనింగ్ హాల్స్ విద్యార్థులకు ఉపయోగపడలేదు. అందులో కూర్చునేందుకు సరైన వసతి కరువైనట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో చెట్ల కింద, ఎండలో కూర్చొని భోజనం చేస్తున్నారు.

సగం పనే చేశారు...

ఆయా పాఠశాలల్లో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంటు నిర్మించాల్సి ఉంది. ఇందుకు గాను ఒక్కో పాఠశాలకు దాదాపు రూ.28 లక్షలు ఆర్‌ఈసీ ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది. అయితే కిచెన్ షెడ్డు నిర్మాణం జరగలేదు, ఆర్వోప్లాంటు పూర్తికాలేదు. సగం పని మాత్రమే చేసినా.. మొత్తం బిల్లు మాత్రం చేసుకున్నారు. ఇదంతా అధికారులకు తెలిసి చేశారా లేక రాజకీయ ఒత్తిళ్లతో చేశారా అనేది తెలియాల్సి ఉంది. డైనింగ్ హాల్‌కు రూ.28లక్షలు ఖర్చు చేసి గోడలు, స్లాబ్ వేశారనుకుంటే.. స్టీల్ ప్యానల్స్ ఉపయోగించి తయారు చేసిన గోడ, పైకప్పులకు ప్యానల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే 2020-21 విద్యా సంవత్సరంలో నల్లపు రెడ్డిపల్లె పాఠశాలలో 710 మంది విద్యార్థులు, సత్రంలో 431, రవీంద్రనాధలో 190, బాలికల పాఠ శాలలో 430, బ్రాహ్మణపల్లెలో 143 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్మాణాలు కాకుండా అన్నిచోట్ల ఒకే రకమైన నిర్మాణాలు చేపట్టడం విశేషం. కేవలం వంద మంది కూడా కూర్చొని తినలేని పరిస్థితి. ఏదిఏమైనా రూ.1.40కోట్ల సీఎస్‌ఆర్ నిధుల్లో ఎంత ఖర్చు చేశారన్నది అధికారులే సమాధానం చెప్పాలి.

చిరునవ్వే అధికారుల సమాధానం

కిచెన్‌షెడ్లు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంట్ నిర్మాణాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించగా చిరునవ్వే వారి సమాధానమైంది. సంబంధిత పనిని అప్పగించేటపుడు మీకు తెలిసి సంతకం పెట్టారా అంటే వారి నుంచి ఎటువంటి సమాధానం లేదు. హ్యాండింగ్ ఓవర్ సర్టిఫికేట్‌ను చూపించమని అడగ్గా అదంతా వద్దని చెప్పడం గమనార్హం. ఈ విషయమై ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ కుమార్‌ను వివరణ అడగ్గా నేమ్ ఆఫ్ వర్క్ ఎలా ఉంటే అలా చేశామని సమాధానమిచ్చారు. కానీ క్షేత్ర స్థాయి పరిశీలనలో కిచెన్ షెడ్లు, ఆర్వోప్లాంట్లు కనిపించక పోవడం విశేషం.

టిప్పర్, లారీ ఢీ... డ్రైవర్ మృతి



లారీ, టిప్పర్ ఢీకొన్న దృశ్యం.. ఇరుక్కుపోయిన మృతదేహం

ముద్దనూరు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిప్రతి హైవేలోని గంగాదేవిపల్లె గ్రామం వద్ద గురువారం సాయంత్రం టిప్పర్, లారీ ఢీకొన్న సంఘటనలో లారీ డ్రైవర్ రాంప్రసాద్(40)అక్కడిక్కడే మృతి చెందాడు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలిలా.. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన రాంప్రసాద్ తాడిపత్రి నుంచి లారీలో బండలలోడు తీసుకొని వస్తుండగా.. ముద్దనూరు వైపు నుంచి టిప్పర్ వెళుతుండగా గంగాదేవిపల్లె వద్ద ఎదురుగా ఢీకొన్నాయి. లారీ ముందు భాగం పూర్తి నుజ్జు నుజ్జు కాగా రాంప్రసాద్ ఇరుక్కుపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ కిరణ్‌కు గాయాలవడంతో 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ దస్తగిరి ప్రమాదస్థలానికి చేరుకొని మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐతెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు

ఖాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోసిరెడ్డిపల్లె హరిజనవాడ సమీపంలో ట్రాక్టర్‌ను బొలోరా వాహనం ఢీకొనడంతో బత్తిన హరికృష్ణ (26) అనే వ్యక్తి మృతి చెందగా..... మరో ముగ్గురికి గాయా లయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కడప నుంచి చికెన్ వ్యర్థాలతో ఖాజీపేట- బద్వేలు రహదారి మీదుగా నెల్లూరుకు వెళుతున్న బొలోరా వాహనం బోసిరెడ్డిపల్లె హరిజనవాడ వద్ద బుధవారం అర్ధరాత్రి ట్రాక్టర్ పంక్చర్ అయి ఆగి ఉండగా ఢీకొంది. దీంతో బొలోరా వాహనంలో ఉన్న హరికృష్ణ అనే వ్యక్తి మృతి చెందాడు. డ్రైవర్, క్లీనర్‌తో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, మృతుడు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిగురుపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అధికారుల వేధింపులతో వ్యక్తి మృతి

- కుటుంబ సభ్యుల ఆరోపణ

కలసపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన ఆకుల పుల్లయ్య బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. పుల్లయ్య గత 30 సంవత్సరాల క్రితం కమలాపురం కాశిరెడ్డి వద్ద పది సెంట్ల పాడుబడిన ఇల్లు, ఖాళీ స్థలం కొనగోలు చేశాడు. ఆ స్థలంలో గడ్డివాములు, దిబ్బలు వేసుకుంటుండగా ఇటీవల రెవెన్యూ అధికారులు గ్రామస్తుల ఫిర్యాదుతో ప్రభుత్వ భూమి అని తేల్చి గడ్డివాములు, కంచెను తొలగించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన పుల్లయ్య మానసిక వత్తిడికి గురై బుధవారం మృతి చెందాడు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సింధూజా, గ్రామ రెవెన్యూ అధికారి రామలక్షుమ్మ, పోలీసుల వత్తిడి వల్లనే పుల్లయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పలువురు మండల నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కట్టెల బ్యాగు కోసి నాలుగు తులాల బంగారు చోరీ

జమ్మలమడుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని కెనరా బ్యాంకులో గురువారం ఇరగంరెడ్డి సావిత్రి అనే మహిళ గోల్డ్ లోన్ కోసం క్యూలో ఉండగా నాలుగు తులాల బంగారు నగలు చోరీ చేశారు. పెద్దదండ్లూరు గ్రామానికిచెందిన ఇరగంరెడ్డి సావిత్రి, భర్త రామమోహన్‌రెడ్డి కెనరా బ్యాంకులో గోల్డ్ లోన్ కోసం వచ్చారు. వరుసక్రమంలో నిలబడి అప్లికేషన్ పూర్తి చేసే సమయంలో ఆమె వెనుకే ఉన్న ఇద్దరు మహిళలు కట్టెల బ్యాగును కోసి పర్సులో ఉన్న తాళిబొట్టు సరుడు, మరో చైనును చోరీ చేశారు. ఈ మేరకు బాధితురాలు సావిత్రి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే అర్బన్ సీఐ లింగప్ప, ఐడీ పార్టీ పోలీసులు బ్యాంకు వద్దకు వెళ్లి సీసీ కెమెరాలను పరిశీలించి.. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గ్రావెల్ తోలుతున్న టిప్పర్లు సీజ్

కడప క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నానాపల్లి వద్ద మైనింగ్ గ్రావెల్ రవాణా చేస్తున్న ఆరు టిప్పర్లు, ఒక ట్రాక్టరును చిన్నచౌకు పోలీసులు గురువారం సీజ్ చేశారు. నానాపల్లి వద్ద ఉన్న కొండను తవ్వి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ మట్టిని టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నట్లు ఎప్పటినుంచో ఆరోపణలు వస్తున్నాయి.
ఈ నేపధ్యంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో సీఐ ఓబులేసుకు సమాచారం మేరకు చిన్నచౌకు పోలీసులు వైఎస్ఆర్‌కాలనీ వద్ద తనిఖీలు చేపట్టారు. మైనింగ్ వద్ద వెళుతున్న టిప్పర్లను గుర్తించారు. డ్రైవర్ల దగ్గర అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ప్రయాణికుల పట్ల డ్రైవర్లు మర్యాదగా మెలగాలి

- ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల పట్ల ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు మర్యాదగా మెలగాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. అలా కాకుండా ఎవరైనా అమర్యాదగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురువారం స్థానిక ఆర్టీసీ రీజనల్ కార్యాలయలో జిల్లాలోని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రయాణికులు చేయి ఎత్తిన చోట బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవలన్నారు. సమయపాలనతో బస్సులు నడిపి తద్వారా ప్రజల మన్ననలు చూరగొనాలని సూచించారు. ముఖ్యంగా మద్యపానం సేవించి విధులకు రాకూడదని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోనులో మాట్లాడరాదని అన్నారు. అద్దె బస్సుల యజమానులకు రావలసిన బకాయిలను త్వరితగతిన చెల్లించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అద్దె బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌తో పాటు వివిధ డిపోలకు చెందిన అద్దెబస్సుల యజమానులు, ప్రొద్దుటూరు, కడప డి పో మేనేజర్లు మల్లికార్జునరెడ్డి, ఢిల్లేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అద్దెబస్సుల యజమానులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి

జాగ్వార్ బాత్ లైటెంగ్ షోరూం ప్రారంభం

- వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి
- తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ హరినాథ్‌బాబు



జాగ్వార్‌బాత్ లైటింగ్ షోరూమును ప్రారంభిస్తున్న ఏపీటీఎస్ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ పెండ్యాల హరినాథ్‌బాబు, జాగ్వార్ బ్రాంచ్ హెడ్ అభిజిత్‌సింగ్

కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గృహ వికాసానికి మారుతున్న కాలానికనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన జాగ్వార్ బాత్ లైటింగ్స్‌ను వినియోగించుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్, సూర్య ఇంటర్నేషన్ అధినేత డాక్టర్ పెండ్యాల హరినాథ్‌బాబు గృహ యజమానులకు సూచించారు. గురువారం స్థానిక చిన్నచౌకు బైపాస్ (బజాజ్ షోరూం పక్కన) నూతనంగా జాగ్వార్ బాత్ లైటింగ్ షోరూంను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా హరినాథ్‌బాబు మాట్లాడుతూ వినియోగదారులను సంతృప్తిపరిచేలా సరికొత్త డిజైన్లతో గల జాగ్వార్‌బాత్ లైటింగ్ సిస్టంను గృహ అవసరాలకు వినియోగించుకుని కుటుంబ అభిరుచులకు తగ్గట్లుగా వాడుకోవాలని సూచించారు. ఈ జాగ్వార్‌బాత్ లైటింగ్ పరికరాల అమ్మకాలు ఇండియాలోనే కాకుండా సుమా రు 55 దేశాల్లో ఇంటర్నేషనల్ స్థాయిలో అమ్మకాల ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈఅవకాశాన్ని కడప నగర ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ గృహాలు కాంతులు విరజిమ్మేలా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాగ్వార్ బ్రాంచ్ హెడ్ అభిజిత్‌సింగ్, సూర్య ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టరు వెంకటేశ్వర్‌రావు, ఏపీ ప్రాజెక్టు అండ్ రిటైల్ హెడ్ సాయిక్రిష్ణ, ఎండీఎస్ విజయ్‌కుమార్, జనతా ఏజెన్సీస్ ప్రొప్రయిటర్ షేక్‌మహమ్మద్ ఆసిఫ్, జాగ్వార్ తెలంగాణ అండ్ ఏపీ ఎస్‌కో హెడ్ వంశీక్రిష్ణ, లైటింగ్ హెడ్ నవీన్‌కుమార్, ఏఎస్‌ఎం పి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాల పంపిణీ



పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

మైలవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మైలవరంటెక్స్‌టైల్ పార్కులో తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాలను లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. మైలవరం టెక్స్‌టైల్ పార్కులో హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్, గార్మెంట్, డైయింగ్ ప్లాట్లను టెక్స్‌టైల్ పార్కులో 118 ప్లాట్లకు గాను 93 మంది లబ్ధిదారులకు తాత్కాలిక ప్లాట్ల పట్టాల పంపిణీ చేసినట్లు ఏడీ పిచ్చేశ్వరరావు తెలిపారు. ఒక్కొక్కరికి 20 నుంచి 30 సెంట్ల వరకు కేటాయించి.. మూడు నెలల్లోగా అమౌంట్ టెక్స్‌టైల్ పార్కు అకౌంట్‌కు లబ్ధిదారులు జమ చేయాలన్నారు. లేనిపక్షంలో వారి ప్లాట్లను రద్దు చేయడం జరుగుతుందన్నారు. అమౌంట్ చెల్లించినవారికి అగ్రిమెంట్ చేసి వివిధ బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో డీవో అహ్మద్, రవి, ప్రకాష్‌రెడ్డి, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ మహిళా విభాగ సమన్వయకర్తల నియామకం

కడప ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం మహిళా సెల్ సమన్వయకర్తలు, సభ్యులను నూతనంగా నియామకం చేశారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి నియామక ఉత్తర్వుల కాపీని నూతన కమిటీకి అందించారు. కోఆర్డినేటర్‌గా మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ డి.విజయలక్ష్మి, కోఆర్డినేటర్‌గా అప్లైడ్ మ్యాథమేటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్.మాధవి, సభ్యులుగా జెనెటిక్స్ జెనోమిక్స్ విభాగం డాక్టర్ పి.ఉస్మాన్‌బాష, అసోసియేట్ ప్రొఫెసర్, జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అనుప్రసన్న, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్ ఎస్.సుమలత, అసిస్టెంట్ బి.ఎం.ఖాజా మొయినుద్దీన్, విద్యార్థి ప్రతినిధిగా ఒకరిని ఎంపిక చేశారు.

కడప ఉక్కును సాధించుకుందాం...

జమ్మలమడుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పార్టీల నేతలు ప్రధానమంత్రి మోడీ ముందు తలవంచి.. పది సంవత్సరాల నుంచి స్టీల్‌ప్లాంట్ విషయంలో మోసం చేస్తున్నారని సీపీఎం జీపు జాతాలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తదితర వక్తలు విమర్శించారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండులో సీపీఎం జీపు జాతాను మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. పాత బస్టాండులోని ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమను సాధించుకోవడంలో టీడీపీ, వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు చేతకాని దద్దమ్మలుగా మారాయని విమర్శించారు. కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే సంకల్పాన్ని పాలక పక్ష రాజకీయ పార్టీలు మరచిపోయాయన్నారు. కడప ఉక్కు అనేది విభజన చట్టంలో ఉన్న ఒక హక్కు అన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. బీజేపీ ఎన్నికల ఎత్తుగడలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇరుక్కుపోయి రాష్ట్ర ప్రయోజనాలను, కడప ఉక్కు పరిశ్రమను తాకట్టు పెట్టాయన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఈ ప్రాంత ప్రజలకు ఒక ఆక్సిజన్ లాంటిదన్నారు. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే ఒక బృహత్తర పరిశ్రమపై రాజకీయ పార్టీలు దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు రామన్న మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ గురించి జనసేన, టీడీపీ, వైసీపీ పార్టీలు కేంద్రంతో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కడపలో బ్రహ్మణికి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యమైనప్పుడు సెయిల్‌కు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. పరిశ్రమ సాధనకోసం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రధానంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే బీజేపీ తరుపున పోరాడాలని లేనిచో రాజీనామా చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మనోహర్, శివకుమార్, అన్వేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఉక్కు పరిశ్రమ ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన వద్దకు చేరుకుని శిలాఫలకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, చాంద్‌బాష, చేనేత కార్మిక సంఘం నాయకులు శివనారాయణ, జమ్మలమడుగు ప్రాంత సీపీఎం నాయకులు, విద్యార్థులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు కన్నెతీర్థంలో శిలాఫలకం వద్ద నినదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం నాయకులు

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆమె భర్తపై కేసు

కొండాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఆమె భర్త ఓంకార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. చౌటిపల్లె గ్రామానికి చెందిన గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన ఓ మహిళ తనను ప్రిన్సిపాల్ భర్త ఓంకార్ లైంగికంగా వేధిస్తున్నాడని, అదే విధంగా ప్రిన్సిపాల్ కూడా తనను తిడుతూ వేధిస్తోందని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్, ఆమె భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఈవిషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. మహిళ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అసత్య ఆరోపణలతో బ్లాక్‌మెయిల్ చేస్తోందని తాము కూడా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

చికిత్సతో కుష్టువ్యాధి నయం

● జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శైలజ



అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శైలజ వైద్య బృందం

రైల్వేకోడూరు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేస్తే నయం అవుతుందని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ తెలిపారు. మండలంలోని శెట్టిగుంట పీహెచ్‌సీ పరిధిలో ఉన్న లిలియన్ మేయర్ జ్యోతి లెప్రసి కాలనీలో గురువారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సానెశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టువ్యాధిపై వస్తున్న అనుమానాలు తొలగించారు. అనంతరం కంటి పరీక్ష నిర్వహించి 36 మందికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా కంటిఅద్దాలు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు ధనుంజయనాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, సౌజన్య, జిల్లా డివిజన్ అధికార బృందం రవికుమార్, శంబుప్రసాద్, గురప్ప, సురేష్, పి.ఓబులేసు, సభ్యులు రమణ, శివాజీ, మణి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లు వేయాలి



ఈవో ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

రైల్వేకోడూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని ఉంగరాలనగర్‌లో సిమెంట్ రోడ్లు వేయాలని మహిళలు పంచాయతీ ఈవో ప్రసాద్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఉంగరాలనగర్‌లో చాలా వీధుల్లో సిమెంట్ రోడ్లు లేవని తెలిపారు. చాలా కాలంగా అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నపాలు చేసినా ఫలితం లేదని, వర్షాకాలంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు పర్యటించి ఇందుకు సంబంధించిన నిధులు కేటాయించి సిమెంట్ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. ఉంగరాలనగర్‌లో రోడ్లు వేయాలని మహిళలు కోరారని పరిశీలించి వేస్తామని సానుకూలంగా పంచాయతీ ఈవో ప్రసాద్ స్పందించారు.

నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్తు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి తేజసాయి

రైల్వేకోడూరురూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి మన భవిష్యత్తు అని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి పి.జే.తేజ సాయి తెలిపారు. గురువారం అంబేడ్కర్ నగర్‌లోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హాస్టల్‌లోని వసతులపై బాలికలతో ఆరా తీశారు. విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లోని వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్లో ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకుని రావాలని తెలిపారు. ముఖ్యంగా శీతాకాలంలో జ్వరాలు ఎక్కువగా వస్తాయని, కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డన్ అమృతజ్యోత్స్న, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

రాజంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామ్‌నగర్‌కు చెందిన వెంకటసాయి కుటుంబానికి జనసేనపార్టీ కడప ఉమ్మడి జిల్లా నాయకుడు అతికారి కృష్ణ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జనసేన పార్టీకి చెందిన పవన్‌కళ్యాణ్ అభిమాని వెంకటసాయి బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే రాజంపేట నియోజకవర్గానికి చెందిన బలిజ యువసేన నాయకుడు భువనగిరిపల్లెకు చెందిన టైల్స్ నరసింహ, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసయ్య, జనసేన పార్టీకి చెందిన అబ్బిగారి గోపాల్ తదితరులు కృష్ణ తరఫున నగదు కుటుంబ సభ్యులకు అందజేశారు.

డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలి

● రాజంపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి వినోద్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేసుకుంటూ అందుకు సంబంధించిన మందులు వాడాలని రాజంపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రాజంపేట మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయ ఆవరణంలో రాజంపేట లయన్స్‌క్లబ్ సహకారంతో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ డ్రైవర్లకు కంటిచూపు తక్కువగా ఉండడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు దృష్టి లోపం లేకుండా చూసుకోవాల్సి బాధ్యత ఉందన్నారు. కంటివైద్య నిపుణులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆకేపాడు డాక్టర్లు డాక్టర్ అశ్వినిచంద్ర, డాక్టర్ అబ్బిశెట్టి బ్రహ్మేంద్ర, డాక్టర్ వికాస్‌లు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్, ఎంవీఐ సంయుక్త ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయుడు, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, టీచర్ల సంఘం రాష్ట్ర నాయకుడు సుబ్రమణ్యంరాజు, నరసింహ తదితరులు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విరివిగా నిర్వహించడానికి ఎళ్లవేళలా ముందుంటామన్నారు. ఈ సందర్భంగా అనేకమంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి హామీ



ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్యలు విన్నవిస్తున్న అంగన్వాడీలు

రాయచోటి(కలెక్టరేట్)/రాయచోటిటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి హామీ ఇచ్చినట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీలక్ష్మి, పి.రాజేశ్వరి, కోశాధికారి బంగారుపాప, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మిలు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టర్ ఆఫీస్‌లోని స్పందన హాల్‌లో జిల్లా ఐసీడీఎస్‌కు సంబంధించిన రివ్యూ సమావేశానికి హాజరైన సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఐసీడీఎస్‌లో ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అవకతవకలు ఉన్నాయని, ముఖ్యంగా హెల్పర్స్‌కు ప్రమోషన్‌లు ఇవ్వలేదని వెంటనే నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాయచోటిలో 7 నెలలు అద్దెలు ఇవ్వలేదని, స్టాక్ సకాలంలో పంపిణీ చేయకుండా ఎఫ్‌ఆర్‌ఎస్ చేయమనడం సరైనది కాదన్నారు. రాజకీయ కక్ష్యతో హెల్పర్స్‌ను హోల్డ్‌లో పెట్టారని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమ్మె హామీల్లో భాగంగా వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా నాయకులు మధురవాణి, సిద్దమ్మ, ఓబులమ్మలు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ఆత్మార్పణ దినం

రామాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేటలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారిశాలలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏటా మాఘ శుద్ధ విదియ రోజున అమ్మవారి ఆత్మార్పణ దినంగా చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ పంచామృత షోడశోప్రచార పూజ, మహాగణపతిపూజ, స్వస్తి పుణ్యహవాచనం, రుద్రాభిషేకం, లలితా సహస్ర నామకుంకుమార్చన, తీర్థప్రసాదాల వినియోగం ఉంటుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు.

మేకలకు నట్టల నివారణ మందులు

రామాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీలోని కుమ్మరపల్లి, హరిజనవాడ, నడిగడ్డపల్లె గ్రామాల్లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడుతున్నాయన్న ఉద్దేశ్యంతో గ్రామాల్లో మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులను తాపుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాఆట్లడుతూ 137 పశువులకు ప్రథమ చికిత్సలు, 16 పశువులకు గర్భకోశ మందులు, 150 గోర్రెలు, 387 పశువులకు వ్యాధి చికిత్సలు, 3146 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగించామన్నారు. పశుయజమానులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలి

పెనగలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళలకు గట్టి భద్రత కలిగిన చట్టాలు ఉన్నాయని, ప్రతి మహిళ చట్టాల గురించి తెలుసుకోవాలని నందలూరు కోర్టు న్యాయవాది మహ్మద్‌అలీ, పెనగలూరు తహశీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డిలు సూచించారు. గురువారం మండల పరిషత్ సభాభవనంలో మహిళలకు మహిళా చట్టాల గురించి విధాన్‌సే సమాదాన్ మహిళా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు పలురకాల న్యాయపరమైన చట్టాలు గురించి వివరించారు. గృహ హింస, బాల్య వివాహాలు, ర్యాగింగ్, ప్రేమపేరుతో మోసం చేయడం తదితర సమస్యల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ సమావేశంలో ఏపీఎం నిరజంన్‌కుమార్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా పద్మజ బాధ్యతలు

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నూతన మండల విద్యాశాఖాధికారిగా పద్మజ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె ఓబులవారిపల్లె ఎంఈవోగా విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిద్దవటం ఎంఈవో-1గా గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన దిశగా విధులకు హాజరుకావాలని, విద్యార్థిని విద్యార్థులకు అందించే మెనూ నాణ్యతలో లోపం ఉంటే కఠినమైన చర్యలు తప్పవన్నారు. విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో ఉండేటట్లు ఉపాధ్యాయులు చూడాలని ఆమె అన్నారు.

జనసైనికుడికి అండగా ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

వీరబల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలంవాండ్లపల్లెకు చెందిన జనసైనికుడు జోకిరెడ్డిబాబుకు రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేశ్ రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. పార్టీ కార్యకర్త నాన్ హీలింగ్ అల్సర్ ఆపరేషన్ తరువాత దాదాపు 10 ఏళ్లుగా నరాల సమస్యతో బాధపడుతున్నాడు. గత 3 సంవత్సరాల నుంచి ఆరోగ్యం రోజు రోజుకి క్షీణిస్తూ అవయవాలు బలహీనపడి నడవలేని పరిస్థితికి వచ్చాడు. ఈ సమస్య వల్ల కంటి చూపు, చెవిటి తనం వచ్చింది. ఈ జనసైనికుడి కష్టాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేశ్ బాధితుడి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సమస్యను జనసేన అధినేత దృష్టికి తీసుకెళ్లి వైద్యం అందించేలా కృషి చేస్తానని భరోసా కల్పించారు.

గండిమడుగులో యువకుడు మృతి

గాలివీడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న గండిమడుగులో గురువారం బెంగాల్‌కు చెందిన ధీరజ్‌కేసరి (24) అనే యువకుడు పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు బెంగాల్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కేసరి తూముకుంట పంచాయతీలో ఉన్న సోలార్‌లో పనిచేస్తూ బుధవారం మధ్యాహ్నం స్నేహితుడితో కలిసి గుండిమడుగు వెళ్లి అక్కడ భోజనం చేసిన అనంతరం చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లి మునిగిపోయాడన్నారు. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో గట్టుపై ఉన్న యువకుడు తమ బంధువులు, పోలీసులకు సమాచారం ఇచ్చారని వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్డీయేలో అరాచక పాలన ఉండదు

● టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చేసిన అరాచక పాలన ఎన్డీయే చేయదని రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. ముక్కావారిపల్లెలో టీడీపీ పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ వైసీపీలో చేసిన అరాచకపాలన, అక్రమ కేసులు, కక్ష్యసాధింపు చర్యలకు ఎన్డీయే పార్టీలో అవకాశం లేదని ఇలాంటి చర్యలను తమ అధినేత చంద్రబాబునాయుడు ప్రోత్సహించరన్నారు. అలాగే చట్టపరంగా అన్నీ సక్రమంగా ఉంటే ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోదన్నారు. దీనిపై వైసీపీ శ్రేణులు రాద్దాంతం చేయడం హాస్యాస్పదమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఎన్డీయే కూటమిని నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా నియోజకవర్గంలో రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. పార్టీ దిశ నిర్దేశాల మేరకు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవాలు

రైల్వేకోడూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవ ఉత్సవాలను గత రెండు రోజులుగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో నిర్వహిస్తున్నారు. గురువారం పంచామృతాభిషేకం, సామూహిక వాసవీ వ్రతం, లలితా సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి



సమావేశంలో ప్రసంగిస్తున్న కోఆప్షన్ సభ్యుడు

రాజంపేటటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్‌గౌస్ బాషా ఆధ్వర్యంలో రాజంపేట ఉర్దూ జూనియర్ కళాశాలలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టీస్ సంస్థ నేతృత్వంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ కళాశాల అధ్యాపకులు సాధిక్, న్యాయవాది ముజఫర్‌అహ్మద్, యోసిన్‌ఖాన్, న్యాయతుల్లా, హెచ్‌ఎం నాగజ్యోతి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఆర్యవైశ్య యువకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి కలపాటి శ్రీధర్, కామిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.

11వ పోలీసు బెటాలియన్‌లో డైరీ ఆవిష్కరణ

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్‌లో గురువారం 2025 పోలీసు డైరీని ఇన్‌చార్జి కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెటాలియన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15.80 లక్షల చేపపిల్లల విడుదల



సోమశిల వెనుకజలాల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్న దృశ్యం

నందలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య, చిత్తూరు జిల్లాలోని మత్స్యక్షేత్రాల నుంచి 15.80 లక్షల పిల్లలను సేకరించి వాటిని కోనాపురం, సోమశిల వెనుకజలాల్లో విడుదల చేశారు. ఈ మేరకు మదనమోహనపురం గ్రామ సర్పంచ్ చుక్కా నిర్మల, టీడీపీ నాయకుడు చుక్కా యానాది, ఉపసర్పంచ్ పుల్లయ్య చేతుల మీదుగా రెండో రోజు గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత, మత్స్యశాఖ అధికారులు వెంకటరమణ, రామ్మోహన్, మురళీకృష్ణ, లైసెన్సుదారులు, మత్స్య గ్రామ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు వైర్ల చోరీతో రైతుల ఆందోళన





చోరీకి గురైన మోటారు వైరును చూపుతున్న రైతు మల్లికార్జున

ఓబులవారిపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దఓరంపాడు పంచాయతీ పాపిరెడ్డిపల్లె వ్యవసాయ మోటారు వైర్లు చోరీ జరుగుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పాపిరెడ్డిపల్లె గ్రామానికి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో సుమారు 50 మంది రైతులకు సంబంధించిన మోటార్ల నుంచి స్టాటర్ల వరకు ఉన్న కేబుల్ వైర్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో కట్ చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన రైతులంతా బొప్పాయి, కర్భూజ గత వారంలో నాటుకున్నామని, పంటకు నీరు పెట్టకపోతే తీవ్ర నష్టం వస్తుందని రైతులు చింతా మల్లికార్జున, నాగేశ్వర, అలసాని రెడ్డయ్య, యక్కంటి వెంకటయ్య తదితరులు ఆవేదన చెందుతున్నారు. వైర్లు చోరీ చేస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని రైతులు కోరుతున్నారు.

రక్తదానం గొప్పది : ఎమ్మెల్యే



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రైల్వేకోడూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని జనసేన రైల్వేకోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులోని సాయిడిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రక్తదాన శిబిరాల్లో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల చాలా మంది క్షతగాత్రులకు రక్తం సరైన సమయానికి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయిడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మంచినీరు అందించడంలో నిర్లక్ష్యమా : సీపీఐ



ఖాళీ బిందెలతో నిరసన తెల్పుతున్న దృశ్యం

నందలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటూరు పంచాయతీ వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీవాసులకు మంచినీటి పథకం లేక దశాబ్దాలుగా అవస్థలు పడుతున్నా పాలకులు, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉండడం దారుణమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవరలు ప్రశ్నించారు. గురువారం వారు గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. వెంటనే ఎస్టీ కాలనీలో మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

వలసల నివారణే ఉపాధి ధ్యేయం



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

వీరబల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు ఎక్కడా వలసలు పోకుండా ఆపడమే ఉపాధి ధ్యేయమని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 2023-24కు సంబంధించి జరిగిన ఉపాధి పనుల్లో భాగంగా నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం కొనసాగుతుందని, గత వారం రోజులుగా ఎస్‌ఆర్పీ మురాద్ ఆధ్వర్యంలో డీఆర్పీతో కలిసి 2023-24 సంబంధించి జరిగిన పనులపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఎంపీడీవో నూర్జహాన్, ఉపాధి సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మన్నూరులో పశువైద్య శిబిరం



నట్టల నివారణ మందును తాపిస్తున్న దృశ్యం

రాజంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం మన్నూరు, నారపురెడ్డిపల్లె, నూనెవారిపల్లె, రామ్‌నగర్, గొల్లపల్లె, సుద్దగుంతల ప్రాంతాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. రాజంపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ కె.ప్రతాప్ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు, 386 పశువులకు నట్టల నివారణ మందులను వేశారు. కార్యక్రమంలో వరదయ్య, బసవరాజు, షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ



ఇసుక తరలింపుపై ఈవో మునిరాజును ప్రశ్నిస్తున్న విచారణాధికారి రామాంజనేయులు

- నివేదిక ఇవ్వాలంటూ లోకాయుక్త ఆదేశాలు
- విచారణాధికారిగా కర్నూలు డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు
- బి.కొత్తకోటలో అన్యాక్రాంతమైన దేవుడి మాన్యం భూముల పరిశీలన

బి.కొత్తకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ పరిధిలోని దేవుడి మాన్యం భూముల అక్రమాలపై వెళ్లిన ఫిర్యాదులపై ఎట్టకేలకు అధికారులు కదిలారు. విచారణాధికారిగా నియమితులైన కర్నూలు జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈవో రామాంజనేయులు గురువారం బి.కొత్తకోట చేరుకుని విచారించారు.

బి.కొత్తకోట పట్టణంలోని ఆంజనేయస్వామి, చౌళేశ్వరస్వామి, నల్లగంగమ్మ ఆలయాలకు చెందిన రూ.కోట్ల విలువైన మాన్యం భూముల నిర్వహణలో అక్రమాల కారణంగా ప్రతియేటా రూ.లక్షల్లో దేవదాయ శాఖకు నష్టం వాటిల్లడమే కాక, విలువైన భూముల్లో ఇసుక తోడివేయడంతో భూమి ధ్వంసం, తదితర ఫిర్యాదులు దేవదాయశాఖ అధికారులతో పాటు రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలంటూ లోకాయుక్త రాష్ట్ర దేవదాయ కమిషనర్‌ను ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు రాష్ట్ర కమిషనర్ విచారణాధికారిని నియమించారు. ఈ అక్రమాలపై గతంలో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.

మాన్యం భూముల్లో తిరిగి..

విచారణాధికారి రామాంజనేయులు బి.కొత్తకోటలోని మాన్యం భూముల్లో తిరిగి ప్రతి అంశాన్ని నేరుగా పరిశీలించారు. రెవెన్యూ అధికారులను రప్పించి భూముల మ్యాప్‌ను పరిశీలించారు. పట్టణ శివారులోని ఆలేటివాగు పక్కనే ఉన్న చెన్నకేశవస్వామి మాన్యంలోని సర్వే నెంబర్-1840, 1726లలో ఇసుక తరలింపు వల్ల ఏర్పడ్డ గుంతలను, లీజు పొందుకున్న వారికి హద్దులు చూపని భూములను, ఏళ్ల తరబడి వేలం వేయని భూములను పరిశీలించారు. బెంగళూరు రోడ్డులోని గంగమ్మ మాన్యం సర్వే నెంబర్-326, 328లలోని 9 ఎకరాల విస్తీర్ణంలో నామమాత్రపు లీజుతో ఇటుకబట్టీలు, నర్సరీ తదితర వాటికి వినియోగించుకుంటున్న ఆరోపణపై భూమికి సంబంధించిన లీజు రసీదుల గురించి నిర్వాహకులను ఆరా తీశారు. తాము 12 ఏళ్లుగా ఉంటున్నామని చెల్లించిన డబ్బుకు ఈ ఏడాది మాత్రమే రసీదు ఇచ్చారని నిర్వాహకులు కమిషనర్‌కు వివరించారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండుగా వాడుకుంటున్న మాన్యం భూమిలో ఏర్పాటు చేసుకున్న బంకుల యజమానులను కమిషనర్ ప్రశ్నించారు. అధికారికంగా అనుమతులు ఇవ్వలేదని, అయినా నెలసరి అద్దె వసూలు చేసుకుంటున్నారని దుకాణదారులు చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మాన్యం భూముల విషయమై చర్చించారు. నిర్దేశించిన సర్వే నెంబర్లకు హద్దులు చూపి, నివేదిక ఇస్తే తాము తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని తహసీల్దార్‌ను డీసీ కోరారు.

నిన్ను చూసి పోవడానికి వచ్చానా..

లోకాయుక్తకు వెళ్లిన ఫిర్యాదులకు సంబంధించి ఆంజనేయ స్వామి ఆలయం, వివిధ ఆలయాల మాన్యం భూముల వద్ద పరిశీలన సమయంలో పలుమార్లు వీటికి సంబంధించిన వివరాలు, రసీదులు ఇవ్వమని విచారణాధికారి బి.కొత్తకోట ఈవో మునిరాజును అడిగారు. ఏమి అడిగినా తన దగ్గర లేవని ఆఫీసులో ఉన్నాయని ఈవో బదులివ్వడంతో డీసీ రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమి లేవంటే ఎలా? అంత దూరం నుంచి నేను నిన్ను చూసిపోవడానికి వచ్చానా అని ప్రశ్నించారు. ఉద్యోగానికి న్యాయం చేయాలని, చేయలేనప్పుడు తప్పుకోవాలని చురకలంటించారు. ఈవోగా ఆరేళ్లుగా పనిచేస్తున్నా ఇటుక బట్టీల వారికి ఒక్క ఏడాది రసీదులు మాత్రమే ఇవ్వడంపై ప్రశ్నించగా ఈవో మౌనం వహించారు.



దేవుడి మాన్యం భూములపై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలు

రాష్ట్ర కమిషనర్‌కు నివేదిక ఇస్తాం..

బి.కొత్తకోట దేవాలయాల మాన్యం భూముల విషయమై వచ్చిన ఫిర్యాదులపై లోకాయుక్త ఆదేశాల మేరకు విచారించాను. నిర్వహణ తీరు లోపభూయిష్టంగా ఉన్న మాట వాస్తవమే. రెవెన్యూ అధికారులు భూమి హద్దులు తేలిస్తే ఇసుక తరలింపుపై స్పష్టత వస్తుంది. విచారణలో తేలిన అంశాలతో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపుతాం.

- రామాంజనేయులు, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, కర్నూలు జిల్లా

ఉద్యాన పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

అనంతరాజుపేట ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు



ప్రదర్శనను తిలకిస్తున్న అసోసియేట్ డీన్ శ్రీనివాస్

రైల్వేకోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని అనంతరాజుపేట అసోసియేట్ డీన్ డాక్టర్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం డక్కిలిలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం వారు సంయుక్తంగా రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో నాల్గవ సంవత్సరం బీఎస్సీ ఉద్యాన కోర్సు చదువుతున్న విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా డక్కిలి గ్రామంలో 3 నెలలుగా రైతులతో కలిసి ఉద్యాన పంటల సాగును పరిశీలిస్తున్నారని తెలిపారు. తమ విద్యార్థులు పంట సాగులో మెళకువలు నేర్చుకున్నారని, విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై రైతు సదస్సుతో పాటు ఉద్యాన పంటల ప్రదర్శన ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రధానంగా రైతులు ఉద్యాన పంటలను పండించే క్రమంలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పెట్లూరు నిమ్మ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ రైతులకు పంటల సాగు, తెగుళ్ల నివారణలో ఎలాంటి సందేహాలు వచ్చినా శాస్త్రవేత్తలను సంప్రదించాలని తెలిపారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ వై.శిరీషా మాట్లాడుతూ తెగుళ్ల నివారణ, పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డక్కిలి మండల ఉద్యాన శాఖాధికారి ఆనంద్, ఉద్యాన కళాశాల ఏడీఆర్ డాక్టర్ బి.హరి, మల్లికార్జున రెడ్డి, నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త కాందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కుష్ఠువ్యాధిపై అవగాహన



కుష్ఠువ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థిని, విద్యార్థులకు స్పర్శ కుష్ఠు వ్యాధి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు పాల్గొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. సిద్దవటం జడ్పీ హైస్కూల్లో గురువారం జాతీయ కుష్ఠు నివారణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని, వ్యాధి నిర్మూలనకు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నిర్మూలనకు స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ నిర్వహించి తెలియజేశామని, చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్యశాలకు వెళ్లి పరీక్షించుకోవాలన్నారు. అనంతరం కుష్ఠు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి రవిబాబు, వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మీ, పాఠశాల హెడ్మాస్టర్ శ్రీరాములు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనకు అనుమతులివ్వండి

- అటవీశాఖను కోరిన పురావస్తుశాఖ
- లంకమల్లలో అరుదైన చిత్రాలు



లంకమల్లలో బండపై ఉన్న చిత్రాలు

సిద్దవటం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అడవుల్లో అరుదైన చిత్రాలను పరిశీలించేందుకు భారతీయ పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నం అటవీశాఖ అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. మండలంలోని లంకమల్ల అటవీ ప్రాంతంలో అరుదైన పురాతన చిత్రాలు బయటపడడంతో సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి భారతీయ పురావస్తుశాఖ అధికారులకు జనవరి 23న నివేదిక పంపించారు. రాయలసీమ ప్రాంతమైన లంకమల్ల అటవీ ప్రాంత సిద్దవటంలో లభించడం ఇదే మొదటిసారి అని, రాతి బండలపై శాసనాలు చెక్కబడి ఉన్నాయని, నాలుగో శతాబ్దపు మానవజాడలు తొలిసారిగా లభ్యం కావడంతో లంకమల్ల అడవుల్లో ఇలాంటి పురాతనమైన చిత్రాలు మరెన్నో ఉంటాయని, వీటిని వెలుగులోకి తీసుకొస్తే లంకమల్ల అందాలు పర్యాటకులకు కనువిందుగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై భారతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నంను వివరణ కోరగా అనుమతుల కోసం అటవీశాఖ ఉన్నతాధికారులకు ఈనెల 26వ తేదీ నివేదిక పంపించామని, అనుమతులు రాగానే లంకమల్ల అటవీ ప్రాంతంలో పరిశీలిస్తామని ఆయన అన్నారు.

స్వర్ణ గ్రామ పంచాయతీగా చేద్దాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సంబేపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో భాగంగా సంబేపల్లె గ్రామ పంచాయతీని స్వర్ణ గ్రామ పంచాయతీగా సిద్ధం చేద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో హంగు, ఆర్భాటం లేకుండా ఎక్కడ చెట్లు, కొమ్మలు తొలగించకుండా పరిశుభ్రతతో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు తెలియజేశారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎంపీడీవో, తహసీల్దార్, స్థానిక అధికారులతో కలిసి చర్చించారు. రాష్ట్రంలో 2047 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే లక్ష్యంగా సంక్షేమాన్ని చేపడతామని తెలియజేశారు. సంబేపల్లె స్వర్ణ గ్రామ పంచాయతీ సాధన కోసం 10 సూత్రాల అమలు కోసం వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు అభివృద్ధి, సంక్షేమం కోసం వెంటనే చర్యలు చేపట్టాలని తెలియజేశారు.

50 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలియజేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పనితీరు సోలార్ విద్యుత్, యువత వివిధ రంగాల్లో శిక్షణా నైపుణ్యాలు ప్రజల ఆర్థిక జీవన స్థితిగతులను పెంచేందుకు చేపట్టవల్సిన పలు అంశాలపై అధికారులకు తెలియజేశారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



పోలీసు అధికారలాంఛనాలతో అంత్యక్రియలు, శశికుమార్ (ఫైల్)

వాల్మీకిపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ పూజారి శశికుమార్ షిర్డీ (51) అంత్యక్రియలు గురువారం పోలీసు అధికార లాంఛనాలతో నిర్వహించారు. వాల్మీకిపురం మండలంలోని ఓబులంపల్లెకు చెందిన సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు పూజారి శశికుమార్ షిర్డీ శ్రీకాళహస్తిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు స్వగ్రామమైన ఓబులంపల్లెలో పోలీసు అధికార లాంఛనాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, స్నేహితులు, బంధువులు శశికుమార్ మృతిపట్ల నివాళులర్పించారు.

నీటి ఎద్దడిపై ముందు జాగ్రత్త చర్యలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు



జడ్పీ సీఈవో రవికుమార్‌తో మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు / పెద్దతిప్పసముద్రం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తెలిపారు. ములకలచెరువు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జడ్పీ సీఈవోను కలిశారు. ముందస్తుగా తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించిందని, ఈ నిధులు తాగునీటి అవసరాలకు వినియోగించాలని జయచంద్రారెడ్డి సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వచ్చే నెల 7వ తేదీ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని, సహకరించాలని సీఈవోను కోరారు. అనంతరం జడ్పీ సీఈవోను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు శంకర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఫజులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య అనేది రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల అధికారులను చిత్తూరు జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించాడు గురువారం ఆయన పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.

మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి మండల నిధులను వాటి ఖర్చులను మిగిలిన నిధులను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల గ్రాంట్‌లో ఉన్న నిధులను ముందస్తుగా మండలంలో ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య అనేది రాకుండా చూడాలని వాటికి కావాల్సిన నిధులను వాడుకోవాలని, మంచినీటి సమస్యకు తప్ప ఈ నిధులను ఏ పనికీ వినియోగించరాదన్నారు. మంచినీటి సమస్యలపై అలసత్వం వహిస్తే అటువంటి అధికారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, ఏవో నిత్యానంద, టీడీపీ నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, పట్టా చంద్రమోహన్‌రెడ్డి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

డీకేటీ భూములకు పట్టాలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కురబలకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివేడు పంచాయతీ పరిధిలో డీకేటీ భూములకు పట్టాలు ఇవ్వడంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'డీకేటీ భూములకు పట్టాలిచ్చేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. ముదివేడు పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్-1630లో దాదాపుగా 4.25 ఎకరాలకు తల్లీ, కొడుకులకు డీకేటీ పట్టాలు ఇవ్వడంపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెక్‌డ్యాంల మాట మరిచారా!

- నదుల నీరు వృథాగా సముద్రంపాలు
- చెక్‌డ్యాంలు నిర్మించాలంటున్న రైతులు



రైల్వేకోడూరులోని ముష్టేరు వద్ద గతంలో నిర్మించిన చెక్‌డ్యాంలో నిల్వ ఉన్న నీరు

రైల్వేకోడూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా సముద్రం పాలవుతోందని, చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే కరువు ఉండదని రైతులు వాపోతున్నా ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ముందుచూపుతో చేసిన పనులు నేటికీ ఫలితాలు ఇస్తున్నాయని రైతులు అంటున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. దక్షిణ భారతదేశంలో అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు, వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. రైల్వేకోడూరును మరో కోనసీమ అని కూడా పిలుస్తారు. రైల్వేకోడూరు ప్రాంతంలో ముష్టేరు, గుంజనేరు, గుండాలేరు, పుల్లంగేరు, మేకలగుంతేరు తదితర నదులు ఉన్నాయి. నదులకు సమీపంలో అడవులు ఉన్నాయి. అడవుల్లో కురిసిన వర్షం ఈ నదుల్లోకి వస్తుంది. ప్రతిఏటా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు వృథాగా పోతోంది. నీటికట్టడికి అటు అధికారులు, ఇటు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారు. ప్రతి నదిలో అక్కడక్కడా చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే ఏళ్ల తరబడి నీరు నిల్వ ఉండేది. అయితే చెక్‌డ్యాంలు లేకపోవడంతో నీరు వృథా కావడమే కాకుండా రైల్వేకోడూరు మండలంలోని ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో కరువుఛాయలు కనిపిస్తున్నాయి. గుంజననదిలో 8 చెక్‌డ్యాంలు, గుండాలేరులో 5 చెక్‌డ్యాంలు, మేకలగుంతేరుపై 4 చెక్‌డ్యాంలు, ముష్టేరు నదిపై 8 చెక్‌డ్యాంలు నిర్మిస్తే భూగర్భజలాలు అడుగంటే ప్రసక్తే ఉండదని రైతులు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి ఎటుచూసినా అడవులు ఉన్నాయి. ప్రత్యేకించి శేషాచలం, వెలుగొండ అడవుల నుంచి వర్షాకాలంలో వచ్చే నీరు నదుల్లో కలుస్తుంటాయి. వీటిని సద్వినియోగం చేసుకుంటే రైల్వేకోడూరుకు నీటి కొరత అనేది ఉండదని ఇది వరకే రైతులు ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసి ఉన్నారు. గతంలో తూతూమంత్రంగా చేసిన చెక్‌డ్యాంలు వరదనీటిలో కొట్టుకునిపోయాయి. పక్కా ప్రణాళికతో చెక్‌డ్యాంలు నిర్మిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయని రైతులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముష్టేరు నదిపై రాజీవ్ గిరిజన కాలనీకి సమీపంలో చెక్‌డ్యాంను నిర్మించడంతో నేటికీ ఫలితాలు కనిపిస్తున్నాయి. నిర్మించిన చెక్‌డ్యాం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. అదేవిధంగా చెక్‌డ్యాం చుట్టుపక్కల రక్షణ గోడ నిర్మాణం చేశారు. దీంతో రైతుల పొలాలు కోతకు గురి కాకుండా ఉన్నాయి. నీటి నిల్వ ఉండడంతో రైతులకు ఉపయోగకరంగా మారింది. రైల్వేకోడూరు ప్రాంతంలో ఉన్న నదులన్నింటికీ అనుసంధానం చేస్తే రైతులకు మేలు చేసే విధంగా ఉండడమే కాకుండా కరువు అనేది రాదని పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. గత ఏడాది తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు భారీగా నదుల్లో వరద నీరు చేరింది. ప్రస్తుతం ఉన్న నీరంతా వృథాగా పోతోంది. నదులను అనుసంధానం చేసి, చెక్‌డ్యాంలు నిర్మిస్తే నీటి నిల్వ ఉండడమే కాకుండా ఇటు రైతులకు అటు ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అంటున్నారు.



రైల్వేకోడూరులో గుంజననది నుంచి వృథాగా పోతున్న వరద నీరు (ఫైల్)

అనుసంధానం మాట మరిచిపోయారు



నదుల అనుసంధానం అనే మాటను నేతలు పూర్తిగా మరిచిపోయారు. గతంలో నదులను అనుసంధానం చేసి వాటిపై చెక్‌డ్యాంలు నిర్మించి ఉంటే నీటి నిలువ ఎప్పుడూ ఉండేది. చెక్‌డ్యాంల నిర్మాణాలు చేయకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారు. అందువల్లే నేడు వచ్చిన నీరు సముద్రంపాలు కాక తప్పలేదు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించి నదులను అనుసంధానం చేయాలి.

- సాధు శివరామయ్య, ఆదర్శ రైతు, మైసూరివారిపల్లె

నీటిని నిల్వ ఉంచాలి



నీటిని నిల్వ ఉంచే ప్రయత్నాలు చేయాలి. వర్షాలకు నదుల్లోకి భారీగానే వరద నీరు వస్తుంది. కానీ ఆ నీటిని నిలబెట్టుకునే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తే అటు రైతులకు, ఇటు ప్రజలకు మేలు కలుగుతుంది. లేదంటే వచ్చిన నీరంతా వచ్చినట్లే పోతుంది. పాలకులు మంచి నిర్ణయాలు తీసుకుంటే నీటి నిల్వ వల్ల రైల్వేకోడూరు నియోజకవర్గం ఇంకా సస్యశ్యామలం అవుతుంది.

- ఉంగరాల క్రిష్ణ, ఆదర్శ రైతు, రైల్వేకోడూరు

రూ.1.40 కోట్లు వృథా



విద్యార్థులు భోజనం చేసేందుకు ఉపయోగపడని కిచెన్ షెడ్డు



బ్రాహ్మణపల్లె పాఠశాలలో ఎండలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

- అలంకారప్రాయంగా డైనింగ్ హాల్స్
- కనిపించని ఆర్వో ప్లాంట్లు, కిచెన్ షెడ్లు
- చెట్ల కింద, ఎండలో భోజనం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం... కార్పొరేట్‌స్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు విద్యతో పాటు సదుపాయాలు కల్పిస్తాం అని గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఆర్భాటపు ప్రకటనలు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వసతులు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారు. దీంతో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు పెద్ద డైనింగ్ హాల్స్ నిర్మించి.. అందులో టేబుళ్లు, కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేసేందుకు భారీగా నిధులు వెచ్చించారు. ఇందుకోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్‌ఈసీ) వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద పులివెందులలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్‌తో పాటు ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 2020 సెప్టెంబర్ 21న ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ మరియు వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. ఒక్కో



బ్రాహ్మణపల్లె పాఠశాలలో డైనింగ్ హాల్‌లో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పాఠశాల వద్ద కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంట్ నిర్మాణానికి దాదాపు రూ.28లక్షలు ఖర్చు చేశారు. ఈ పనులు 31.03.2023 నాటికి పూర్తి కావాల్సి ఉంది. అయితే పనులు పూర్తి కాకుండానే 19-01-2024 తేదీ నాటికి ఆర్‌ఈసీ సంస్థకు బిల్లులు చెల్లించారు.

అలంకారప్రాయంగా...

పులివెందుల పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల (నల్లపురెడ్డిపల్లె), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సత్రం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రవీంద్రనాథ), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికల), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బ్రాహ్మణపల్లె)ల్లో నిర్మించిన డైనింగ్ హాల్స్ విద్యార్థులకు ఉపయోగపడలేదు. అందులో కూర్చునేందుకు సరైన వసతి కరువైనట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో చెట్ల కింద, ఎండలో కూర్చొని భోజనం చేస్తున్నారు.

సగం పనే చేశారు...

ఆయా పాఠశాలల్లో కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంటు నిర్మించాల్సి ఉంది. ఇందుకు గాను ఒక్కో పాఠశాలకు దాదాపు రూ.28 లక్షలు ఆర్‌ఈసీ ఖర్చు చేసినట్లు స్పష్టమవుతోంది. అయితే కిచెన్ షెడ్డు నిర్మాణం జరగలేదు, ఆర్వోప్లాంటు పూర్తికాలేదు. సగం పని మాత్రమే చేసినా.. మొత్తం బిల్లు మాత్రం చేసుకున్నారు. ఇదంతా అధికారులకు తెలిసి చేశారా లేక రాజకీయ ఒత్తిళ్లతో చేశారా అనేది తెలియాల్సి ఉంది. డైనింగ్ హాల్‌కు రూ.28లక్షలు ఖర్చు చేసి గోడలు, స్లాబ్ వేశారనుకుంటే.. స్టీల్ ప్యానల్స్ ఉపయోగించి తయారు చేసిన గోడ, పైకప్పులకు ప్యానల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే 2020-21 విద్యా సంవత్సరంలో నల్లపు రెడ్డిపల్లె పాఠశాలలో 710 మంది విద్యార్థులు, సత్రంలో 431, రవీంద్రనాథలో 190, బాలికల పాఠ శాలలో 430, బ్రాహ్మణపల్లెలో 143 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్మాణాలు కాకుండా అన్నిచోట్ల ఒకే రకమైన నిర్మాణాలు చేపట్టడం విశేషం. కేవలం వంద మంది కూడా కూర్చొని తినలేని పరిస్థితి. ఏదిఏమైనా రూ.1.40కోట్ల సీఎస్‌ఆర్ నిధుల్లో ఎంత ఖర్చు చేశారన్నది అధికారులే సమాధానం చెప్పాలి.

చిరునవ్వే అధికారుల సమాధానం

కిచెన్‌షెడ్డు, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంట్ నిర్మాణాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించగా చిరునవ్వే వారి సమాధానమైంది. సంబంధిత పనిని అప్పగించేటపుడు మీకు తెలిసి సంతకం పెట్టారా అంటే వారి నుంచి ఎటువంటి సమాధానం లేదు. హ్యాండింగ్ ఓవర్ సర్టిఫికేట్‌ను చూపించమని అడగ్గా అదంతా వద్దని చెప్పడం గమనార్హం. ఈ విషయమై ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ కుమార్‌ను వివరణ అడగ్గా నేమ్ ఆఫ్ వర్క్ ఎలా ఉంటే అలా చేశామని సమాధానమిచ్చారు. కానీ క్షేత్ర స్థాయి పరిశీలనలో కిచెన్ షెడ్లు, ఆర్వోప్లాంట్లు కనిపించక పోవడం విశేషం.

టిప్పర్, లారీ ఢీ... డ్రైవర్ మృతి



లారీ, టిప్పర్ ఢీకొన్న దృశ్యం.. ఇరుక్కుపోయిన మృతదేహం

ముద్దనూరు జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప-తాడిపత్రి హైవేలోని గంగాదేవిపల్లె గ్రామం వద్ద గురువారం సాయంత్రం టిప్పర్, లారీ ఢీకొన్న సంఘటనలో లారీ డ్రైవర్ రాంప్రసాద్(40)అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలిలా.. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన రాంప్రసాద్ తాడిపత్రి నుంచి లారీలో బండలలోడు తీసుకొని వస్తుండగా.. ముద్దనూరు వైపు నుంచి టిప్పర్ వెళుతుండగా గంగాదేవిపల్లె వద్ద ఎదురుగా ఢీకొన్నాయి. లారీ ముందు భాగం పూర్తి నుజ్జు నుజ్జు కాగా రాంప్రసాద్ ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ కిరణ్‌కు గాయాలవడంతో 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ దస్తగిరి ప్రమాదస్థలానికి చేరుకొని మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐతెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు

ఖాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోసిరెడ్డిపల్లె హరిజనవాడ సమీపంలో ట్రాక్టర్‌ను బొలేరా వాహనం ఢీకొనడంతో బత్తిన హరికృష్ణ (26) అనే వ్యక్తి మృతి చెందగా..... మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కడప నుంచి చికెన్ వ్యర్థాలతో ఖాజీపేట- బద్వేలు రహదారి మీదుగా నెల్లూరుకు వెళుతున్న బొలేరా వాహనం బోసిరెడ్డిపల్లె హరిజనవాడ వద్ద బుధవారం అర్ధరాత్రి ట్రాక్టర్ పంక్చర్ అయి ఆగి ఉండగా ఢీకొంది. దీంతో బొలేరా వాహనంలో ఉన్న హరికృష్ణ అనే వ్యక్తి మృతి చెందాడు. డ్రైవర్, క్లీనర్‌తో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, మృతుడు నంద్యాల జిల్లా గడివేముల మండలం చిగురుపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

అధికారుల వేధింపులతో వ్యక్తి మృతి

- కుటుంబ సభ్యుల ఆరోపణ

కలసపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన ఆకుల పుల్లయ్య బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. పుల్లయ్య గత 30 సంవత్సరాల క్రితం కమలాపురం కాశిరెడ్డి వద్ద పది సెంట్ల పాడుబడిన ఇల్లు, ఖాళీ స్థలం కొనగోలు చేశాడు. ఆ స్థలంలో గడ్డివాములు, దిబ్బలు వేసుకుంటుండగా ఇటీవల రెవెన్యూ అధికారులు గ్రామస్తుల ఫిర్యాదుతో ప్రభుత్వ భూమి అని తేల్చి గడ్డివాములు, కంచెను తొలగించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన పుల్లయ్య మానసిక వత్తిడికి గురై బుధవారం మృతి చెందాడు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సింధూజా, గ్రామ రెవెన్యూ అధికారి రామలక్షుమ్మ, పోలీసుల వత్తిడి వల్లనే పుల్లయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పలువురు మండల నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కట్టెల బ్యాగు కోసి నాలుగు తులాల బంగారు చోరీ

జమ్మలమడుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని కెనరా బ్యాంకులో గురువారం ఇరగంరెడ్డి సావిత్రి అనే మహిళ గోల్డ్ లోన్ కోసం క్యూలో ఉండగా నాలుగు తులాల బంగారు నగలు చోరీ చేశారు. పెద్దదండ్లూరు గ్రామానికిచెందిన ఇరగంరెడ్డి సావిత్రి, భర్త రామమోహన్‌రెడ్డి కెనరా బ్యాంకులో గోల్డ్ లోన్ కోసం వచ్చారు. వరుసక్రమంలో నిలబడి అప్లికేషన్ పూర్తి చేసే సమయంలో ఆమె వెనుకే ఉన్న ఇద్దరు మహిళలు కట్టెల బ్యాగును కోసి పర్సులో ఉన్న తాళిబొట్టు సరుడు, మరో చైనును చోరీ చేశారు. ఈ మేరకు బాధితురాలు సావిత్రి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే అర్బన్ సీఐ లింగప్ప, ఐడీ పార్టీ పోలీసులు బ్యాంకు వద్దకు వెళ్లి సీసీ కెమెరాలను పరిశీలించి.. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

గ్రావెల్ తోలుతున్న టిప్పర్లు సీజ్

కడప క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నానాపల్లి వద్ద మైనింగ్ గ్రావెల్ రవాణా చేస్తున్న ఆరు టిప్పర్లు, ఒక ట్రాక్టరును చిన్నచౌకు పోలీసులు గురువారం సీజ్ చేశారు. నానాపల్లి వద్ద ఉన్న కొండను తవ్వి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ మట్టిని టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నట్లు ఎప్పటినుంచో ఆరోపణలు వస్తున్నాయి.

ఈ నేపధ్యంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో సీఐ ఓబులేసుకు సమాచారం మేరకు చిన్నచౌకు పోలీసులు వైఎస్‌ఆర్‌కాలనీ వద్ద తనిఖీలు చేపట్టారు. మైనింగ్ వద్ద వెళుతున్న టిప్పర్లను గుర్తించారు. డ్రైవర్ల దగ్గర అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ప్రయాణికుల పట్ల డ్రైవర్లు మర్యాదగా మెలగాలి

- ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల పట్ల ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు మర్యాదగా మెలగాలని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పొలిమేర గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. అలా కాకుండా ఎవరైనా అమర్యాదగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురువారం స్థానిక ఆర్టీసీ రీజనల్ కార్యాలయంలో జిల్లాలోని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రయాణికులు చేయి ఎత్తిన చోట బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవలన్నారు. సమయపాలనతో బస్సులు నడిపి తద్వారా ప్రజల మన్ననలు చూరగొనాలని సూచించారు. ముఖ్యంగా మద్యపానం సేవించి విధులకు రాకూడదని, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోనులో మాట్లాడరాదని అన్నారు. అద్దె బస్సుల యజమానులకు రావలసిన బకాయిలను త్వరితగతిన చెల్లించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అద్దె బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు భాస్కర్‌తో పాటు వివిధ డిపోలకు చెందిన అద్దెబస్సుల యజమానులు, ప్రొద్దుటూరు, కడప డి పో మేనేజర్లు మల్లికార్జునరెడ్డి, డిల్లేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అద్దెబస్సుల యజమానులతో మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు

కడప మారుతీనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి పీఎఫ్, ఈ ఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవ ర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీ యూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామన మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆటో యూనియన్ నాలుగవ మహాసభలు నిర్వహించా రు. ముఖ్యఅతిథిగా వామన మూర్తితో పాటు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. కడప జిల్లాలోనే 35వేల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారన్నారు. వీరంతా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ప్ర యాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తున్నారన్నారు. కావున ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూ డిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెం.2131 తక్షణం ర ద్దు చేయాలన్నారు. అలాగే డీజలు, పెట్రోలు థర్డ్ పార్టీ ఇన్సురెన్స్ 30 శాతానికి తగ్గంచాలన్నారు. ఆటోల మీద ఉన్న పోలీసు ఇ-చలానాలు తక్షణమే రద్దు చేయాలన్నారు.

15.80 లక్షల చేపపిల్లల విడుదల

నందలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య, చిత్తూరు జిల్లాలోని మత్స్యక్షేత్రాల నుంచి 15.80 లక్షల పిల్లలను సేకరించి వాటిని కోనాపురం, సోమశిల వెనుకజలాల్లో విడుదల చేశారు. ఈ మేరకు మదనమోహనపురం గ్రామ సర్పంచ్ చుక్కా నిర్మల, టీడీపీ నాయకుడు చుక్కా యానాది, ఉపసర్పంచ్ పుల్లయ్య చేతుల మీదుగా రెండో రోజు గురువారం విడుదల చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత, మత్స్యశాఖ అధికారులు వెంకటరమణ, రామ్మోహన్, మురళీకృష్ణ, లైసెన్సుదారులు, మత్స్య గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

గండిమడుగులో యువకుడు మృతి

గాలివీడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న గండిమడుగులో గురువారం బెంగాల్‌కు చెందిన ధీరజ్‌కేసరి (24) అనే యువకుడు పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు బెంగాల్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కేసరి తూముకుంట పంచాయతీలో ఉన్న సోలార్‌లో పనిచేస్తూ బుధవారం మధ్యాహ్నం స్నేహితుడితో కలిసి గుండిమడుగు వెళ్లి అక్కడ భోజనం చేసిన అనంతరం చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లి మునిగిపోయాడన్నారు. ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో గట్టుపై ఉన్న యువకుడు తమ బంధువులు, పోలీసులకు సమాచారం ఇచ్చారని వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కులో తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాల పంపిణీ



పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

మైలవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మైలవరంటెక్స్‌టైల్ పార్కులో తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాలను లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. మైలవరం టెక్స్‌టైల్ పార్కులో హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్, గార్మెంట్, డైయింగ్ ప్లాట్లను టెక్స్‌టైల్ పార్కులో 118 ప్లాట్లకు గాను 93 మంది లబ్ధిదారులకు తాత్కాలిక ప్లాట్ల పట్టాల పంపిణీ చేసినట్లు ఏడీ పిచ్చేశ్వరరావు తెలిపారు. ఒక్కొక్కరికి 20 నుంచి 30 సెంట్ల వరకు కేటాయించి.. మూడు నెలల్లోగా అమౌంట్ టెక్స్‌టైల్ పార్కు అకౌంట్‌కు లబ్ధిదారులు జమ చేయాలన్నారు. లేనిపక్షంలో వారి ప్లాట్లను రద్దు చేయడం జరుగుతుందన్నారు. అమౌంట్ చెల్లించినవారికి అగ్రిమెంట్ చేసి వివిధ బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో డీవో అహ్మద్, రవి, ప్రకాష్‌రెడ్డి, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ మహిళా విభాగ సమన్వయకర్తల నియామకం

కడప ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం మహిళా సెల్ సమన్వయకర్తలు, సభ్యులను నూతనంగా నియామకం చేశారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి నియామక ఉత్తర్వుల కాపీని నూతన కమిటీకి అందించారు. కోఆర్డినేటర్‌గా మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ డి.విజయలక్ష్మి, కోఆర్డినేటర్‌గా అప్లైడ్ మ్యాథమేటిక్స్ విభాగం ప్రొఫెసర్ ఎల్.మాధవి, సభ్యులుగా జెనెటిక్స్ జెనోమిక్స్ విభాగం డాక్టర్ పి.ఉస్మాన్‌బాష, అసోసియేట్ ప్రొఫెసర్, జంతుశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.అనుప్రసన్న, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్ ఎన్.సుమలత, అసిస్టెంట్ బి.ఎం.ఖాజా మొయినుద్దీన్, విద్యార్థి ప్రతినిధిగా ఒకరిని ఎంపిక చేశారు.

కడప ఉక్కును సాధించుకుందాం...

జమ్మలమడుగు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పార్టీల నేతలు ప్రధానమంత్రి మోడీ ముందు తలవంచి.. పది సంవత్సరాల నుంచి స్టీల్‌ప్లాంట్ విషయంలో మోసం చేస్తున్నారని సీపీఎం జీపు జాతాలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తదితర వక్తలు విమర్శించారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని పాత బస్టాండులో సీపీఎం జీపు జాతాను మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు. పాత బస్టాండులోని ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమను సాధించుకోవడంలో టీడీపీ, వైసీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు చేతకాని దద్దమ్మలుగా మారాయని విమర్శించారు. కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే సంకల్పాన్ని పాలక పక్ష రాజకీయ పార్టీలు మరచిపోయాయన్నారు. కడప ఉక్కు అనేది విభజన చట్టంలో ఉన్న ఒక హక్కు అన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. బీజేపీ ఎన్నికల ఎత్తుగడలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఇరుక్కుపోయి రాష్ట్ర ప్రయోజనాలను, కడప ఉక్కు పరిశ్రమను తాకట్టు పెట్టాయన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఈ ప్రాంత ప్రజలకు ఒక ఆక్సిజన్ లాంటిదన్నారు. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే ఒక బృహత్తర పరిశ్రమపై రాజకీయ పార్టీలు దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు రామన్న మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ గురించి జనసేన, టీడీపీ, వైసీపీ పార్టీలు కేంద్రంతో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కడపలో బ్రహ్మణికి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యమైనప్పుడు సెయిల్‌కు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. పరిశ్రమ సాధనకోసం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రధానంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే బీజేపీ తరుపున పోరాడాలని లేనిచో రాజీనామా చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మనోహర్, శివకుమార్, అన్వేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఉక్కు పరిశ్రమ ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన వద్దకు చేరుకుని శిలాఫలకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, చాంద్‌బాష, చేనేత కార్మిక సంఘం నాయకులు శివనారాయణ, జమ్మలమడుగు ప్రాంత సీపీఎం నాయకులు, విద్యార్థులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు కన్నెతీర్థంలో శిలాఫలకం వద్ద నినదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం నాయకులు

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆమె భర్తపై కేసు

కొండాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఆమె భర్త ఓంకార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. చౌటిపల్లె గ్రామానికి చెందిన గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన ఓ మహిళ తనను ప్రిన్సిపాల్ భర్త ఓంకార్ లైంగికంగా వేధిస్తున్నాడని, అదే విధంగా ప్రిన్సిపల్ కూడా తనను తిడుతూ వేధిస్తోందని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్, ఆమె భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. మహిళ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అసత్య ఆరోపణలతో బ్లాక్‌మెయిల్ చేస్తోందని తాము కూడా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరి

- ప్రభుత్వ మైనార్టీ సంబంధాల సలహాదారుడు మహమ్మద్ షరీఫ్



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న మైనారిటీ సలహాదారుడు షరీఫ్ అహ్మద్

కడప ఎడ్యుకేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే డొక్కా సీత మ్మ మధ్యాహ్న భోజ నం పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వ మైనార్టీ సంబంధాల సలహాదారుడు మహమ్మద్ షరీఫ్ అహ్మద్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం కడప నగరం ఏపీమోడల్ ఉర్దూ బాయ్స్ పాఠశాలను ఆయనతో పాటు కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ముందుగా విద్యార్థులతో మా ట్లాడారు. అక్కడున్న సమస్యలను అడిగి తె లుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడు తూ నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థీ బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శం షుద్దీన్, ఎంఈఓ గంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ కంటే అధ్వానంగా టీడీపీ పాలన

- పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్

వేంపల్లె, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దింపి అరాచక మద్య, జూద, మాదకద్రవ్య, గంజా యి ఆంధ్రప్రదేశ్‌గా తయారుచేసి వెళ్లిపోయిందని.. ప్రస్తుతం వచ్చిన టీడీపీ కూటమి పాల న అంతకంటే అధ్వానంగా ఉందని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ మండిపడ్డారు. గురువారం వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి, పులివెందుల కాంగ్రెస్ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన పెనం మీ ద నుంచి నిప్పుల పొయ్యిలో పడ్డట్లయిందని విమర్శించారు. జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

అంగన్‌వాడీలను ఆదర్శంగా నిలపాలి

●రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి సూర్యకుమారి సూచన ● పీలేరు, కలకడలో అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



పీలేరులోని యల్లమంద క్రాస్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న రాష్ట్ర స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సూర్యకుమారి

పీలేరు/కలకడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర స్త్రీ, శిశు, ప్రత్యేక ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి సూర్యకుమారి సూచించారు. పీలేరు పట్టణం యల్లమంద క్రాసులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేసి కేంద్రంలోని చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. ఈసందర్భంగా చిన్నారులకు అందుతున్న ఆహారం, నేర్పుతున్న పాఠాలు, ఆటలు, పద్యాల గురించి వాకబు చేశారు. అంగన్‌వాడీకి సరఫరా అవుతున్న నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. కేంద్రంలో వంటలు వాడే విధానాన్ని కార్యకర్త ఇందిర, సహాయకురాలిని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత ప్రమాణాల కన్నా తక్కువ బరువున్న పిల్లలను పరీక్షించి వారి ఎదుగుదలకు చేపడుతున్న ప్రత్యేక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందించాలని, ప్రతి నెలా వారి ఎదుగుదలను నమోదు చేయడంతోపాటు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు తనిఖీ చేయాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీఎల్‌డీవో లక్ష్మీపతి, ఎంపీడీవో శివశంకర్, సీడీపీవో రాజమ్మ, సూపర్‌వైజర్లు స్వరూప, అక్కాయమ్మ పాల్గొన్నారు.

కాగా కలకడ మండలం బాటవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సూర్యకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటలను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన వంటకాలను వడ్డిస్తున్నారా అని ఆరాతీశారు. అనంతరం తరగతి గదికి వెళ్లి పాఠ్యాంశాలు, బోధన తీరుపై చర్చించారు. పిల్లల ఆటలపట్ల ఆసక్తి చూపుతున్నారా..వారికి కావాల్సిన క్రీడా వస్తువులను అందుబాటులో ఉన్నాయా అంటూ ఆరాతీశారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించడకుండా నిర్ధేత సమయానికి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. క్రమం తప్పకుండా పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రంలో మౌలిక వసతులపై సమీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతూ శాఖపరంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లాఅధికారి లక్ష్మీపతి, మస్తాన్‌వలి, రమాదేవి, రాజమ్మ, అబ్దుల్‌రహీం, మునీంద్రనాయక్, శాంత, యశోధ రాణి, కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

పాడి ఆవులు, లేగదూడల సంరక్షణే లక్ష్యం



సురేష్, పశువైద్యాధికారి, నిమ్మనపల్లె

నిమ్మనపల్లె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాడి ఆవులు, లేగదూడల సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పశువైద్యాధికారి సాదు సురేష్ వెల్లడించారు. మండలంలోని పది పంచాయతీల్లో 12వేల పాడిఆవులతోపాటు 19వేల మేకలు, గొర్రెలు ఉన్నట్లు తెలిపారు. ఆ మేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: లేగదూడల సంరక్షణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 20వ నుంచి లేగదూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తున్నామన్నారు.

ప్రశ్న: పశువుల్లో బొబ్బల వ్యాధి నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఈ బొబ్బల వ్యాధి కేవలం 6నెలల దూడలకు మాత్రమే సోకుతుంది. దీన్ని నివారించేందుకు గ్రామాలలో ఉచితంగా పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: పశుగణన సర్వే ఏస్థాయిలో ఉంది.?

జవాబు: మండలంలో పశుగణన ఇప్పటి వరకు 69.73శాతం నమోదు చేశాం. ఫిబ్రవరి 28లోగా వందశాతం పూర్తి చేస్తాం.

ప్రశ్న: పశు వైద్యశాలల్లో మందుల కొరత ఉందా.?

జవాబు: పశువైద్యశాలల్లో అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: మండలంలో గోశాలల పరిస్థితి ఎలా ఉంది?

జవాబు: ఉపాధి హామీ పథకం ద్వారా 25 గోశాలలు మంజూరు కాగా ఇప్పటి వరకు 14గోశాలలు పూర్తి అయ్యాయి.

ప్రశ్న: మండలంలో ఎన్ని పశువైద్యశాలలు ఉన్నాయి? సిబ్బంది ఎందున్నారు?

జవాబు: మండలంలో 2 పశువైద్యశాలలు, 3 గ్రామీణ వైద్యకేంద్రాలు, 7 రైతు సేవా కేంద్రాల ద్వారా 12మంది సిబ్బంది పని చేస్తున్నారు.

ఆదివాసీ ఎరుకుల సంఘం ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస వర్మ



కలికిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఎరుకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా స్థానిక గిరిజన కాలనీకి చెందిన శ్రీనివాస వర్మ ఎంపికయ్యారు. ఏపీ ఆదివాసీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరావు గురువారం ఈ మేరకు శ్రీనివాస వర్మ నియామకాన్ని ప్రకటించారు. ఎరుకల కులాల సంక్షేమానికి వర్మ న్యాయం చేయగలరన్న విశ్వాసంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆదేశాల మేరకు ఎరుకల హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఉన్నత స్థానాన్ని అప్పగిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, చిత్తూరు, తిరుపతి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కమిటీలు ఈ సందర్భంగా శ్రీనివాస వర్మను అభినందించారు. కాగా శ్రీనివాస వర్మ గత ఐదేళ్ళుగా జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ విభాగంలో చురుగ్గా పాల్గొంటున్నారు. వర్మ నియామకంపై ఆ పార్టీ వర్గాలు శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గుర్రంకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ మధురామచంద్రుడు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పకుండా ధరించి వాహనాలను నడపాలన్నారు. అలాగే తల్లిదండ్రులు మైనర్‌లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదన్నారు.

గొడవ చేసిన వారిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు ఎదురుగా మద్యం మత్తులో గొడవచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో గొడవ పడుతున్న విషయాన్ని స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకోగా వారిపైన తిరగపడ్డారు. అనంతరం రాత్రి వారిని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసులపై దౌర్జన్యం, విధులకు ఆటంకం కలిగించిన ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. ఇందులో నాగ, వెంకటేష్, శివాజీ, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారని సీఐ తెలిపారు.

సీఎంను కలిసిన టీడీపీ నేత రామకృష్ణ



సీఎంతో టీడీపీ సీనియర్ నేత ఆర్కే రామకృష్ణ

మదనపల్లె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్కే రామకృష్ణ, సీఎం చంద్రబాబు నాయుడును కలిశారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మదనపల్లె రాజకీయ అంశాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోవైపు మదనపల్లె పట్టణ అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని ఆర్కే రామకృష్ణ సీఎంకు అందచేశారు.

ఆసుపత్రి నిర్మాణానికి రూ.లక్ష విరాళం



చెక్కును లయన్స్ క్లబ్ సభ్యులకు అందజేస్తున్న శ్రీపురం వెంకటేశ్

పీలేరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న కంటి, కిడ్నీ ఆసుపత్రి భవనానికి స్థానిక బంగారు నగల వ్యాపారి శ్రీపురం వెంకటేశ్ రూ.లక్ష విరాళం అందజేశారు. పీలేరులో గురువారం జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పామిడి మహేశ్, సభ్యులు చింతల విజయభాస్కర్, సుబ్రహ్మణ్యంలకు తన విరాళం చెక్కును అందజేశారు. ఆసుపత్రి నిర్మాణానికి సాయం చేసినందుకు వెంకటేశ్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

గీతకులాలకు నాలుగు మద్యం దుకాణాలు

మదనపల్లె టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గీత కులాలకు నాలుగు మద్యం దుకాణాలు కేటాయించనున్నట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటి, రామసముద్రం, నిమ్మనపల్లె మూడు ప్రాంతాల్లో ఈడిగ కులానికి చెందిన వారికి, బి.కొత్తకోట రూరల్‌లో గౌడ్ కులానికి చెందిన వారికి మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఈ కులాలకు చెందిన వారికి మద్యం దుకాణాల లైసెన్సు జనరల్ రుసుము 50శాతం కడితే చాలన్నారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 5వ తేదీ లోపు రూ.2లక్షల చొప్పున దరఖాస్తు రుసుము(నాన్ రీఫండబుల్) చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన రాయచోటి కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లక్కీడ్రా తీసి మద్యం దుకాణాలు కేటాయిస్తామని సీఐ చెప్పారు.

జనరిక్ మెడికల్‌షాపులకు 50శాతం సబ్సిడీ

మదనపల్లె టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనకబడిన సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మదనపల్లె మండలంలో జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు 50శాతం సబ్సిడీ వస్తుందని ఎంపీడీవో తాజ్ మస్రూర్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కాపు, బీసీ, ఈబీసీ, రెడ్డి, ఆర్యవైశ్యుల కులాలకు చెందిన వారికి మదనపల్లె మండలంలో 91 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో బీసీ కులాలకు 65, కాపు కార్పొరేషన్ కింద 20, ఈబీసీకి 3, రెడ్డి కులానికి 2, ఆర్యవైశ్యులకు 1 మంజూరవుతాయన్నారు. అర్హతగల లబ్ధిదారులు ఫిబ్రవరి 7 లోపు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ పనివేళల్లో వచ్చి సంప్రదించాలని కోరారు.

వైభవంగా రాజ గోపురం ప్రతిష్ఠోత్సవాలు



ఆలయ రాజ గోపుర కళశాలను జలాధివాసంకు తీసుకువెళ్తున్న టీటీడీ వేదపండితులు

తంబళ్లపల్లె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ రాజ గోపురం ప్రతిష్ఠ మహోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున వేదపండితులు స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దూపదీప నైవేద్యాలతో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం ఆగమ అడ్వైజర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ రాజ గోపురంపై ప్రతిష్ఠించబోయే కళశాలకు అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించి జలాధివాసం చేశారు. మండల ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కురబలకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి):వయోజనులకు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడ మే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. గురువారం మండలం లోని స్థానికి ఎంపసీడీవో కార్యాలయంలో ఉల్లాస్‌పై సిబ్బందికి శిక్షణాతరగతులను నిర్వహించారు. అనంతరం వారికి టీఎల్‌ఎమ్ మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

కొబ్బరి యాజమాన్య పద్ధతులపై శిక్షణ

కలికిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి పంటలపై ఆసక్తి ఉన్న రైతుల కోసం వారం రోజులపాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం క్షేత్ర స్థాయి శిక్షణ ఇచ్చారు. ఇందు కోసం పలు ప్రాంతాలకు చెందిన 20 మంది రైతులను ఎంపిక చేశారు. యాంత్రిక కోకోనట్ క్లైంబర్‌ను ఉపయోగించి సుళువుగా కొబ్బరి చెట్ల ఎక్కే విధానాల గురించి వివరించారు.

విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తే ఊరుకోం



విద్యార్థులతో మాట్లాడుతున్న టీడీపీ నేత దొరస్వామినాయుడు

ములకలచెరువు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చేత వెట్టిచారికి చేయించి వేధింపులకు గురిచేస్తే ఊరుకోమని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు హెచ్చరించారు. కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థుల చేత వెట్టిచాకిరీ చేయించడం, వేధింపులకు గురిచేయడం, డబ్బులు వసూలు చేస్తున్నట్లు సామాజిక తనిఖీ బృందం నిగ్గు తేల్చడంతో గురువారం పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా చూడాల్సిపోయి వేధించి భోజనం సరిగా పెట్టకపోవడం దారుణమన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న మందులు పరిశీలించి సరపడా లేకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రెండు నెలలకు సరిపడా సేఫ్టీ న్యాప్‌కిన్స్‌ను తన సొంత ఖర్చుతో పంపుతానని తెలిపారు. ఆయన వెంట కేవీఎన్ టమోటా మండీ యజమాని కట్టా విజయ్‌నాయుడు తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



బి.కొత్తకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అవార్డు గ్రహీత బి.కొత్తకోట ఎంఈవో రెడ్డిశేఖర్ ను మండలంలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావం చూపినందుకు రెడ్డిశేఖర్ ఉత్తమ ఎంఈవోగా ఎంపికై గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ నేపథ్యంలో పలువురు యూనియన్ నాయకులు ఎమ్మార్సీకి చేరుకొని ఎంఈవోను పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఎస్టీయూ జిల్లా మాజీ ప్రధానకార్యదర్శి భాస్కర్‌రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, ఖాదర్‌వలి, జిల్లా నాయకుడు రమేష్‌బాబు, ఎంఈవో2 భీమేశ్వరాచారి, ఉపాధ్యాయులు రమణ, విశ్వనాథరెడ్డి, మునిరెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, రెడెప్ప తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని రెండు గొర్రెలు మృతి

నిమ్మనపల్లి జనవరి 30(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీ కొనడంతో రెండు గొర్రెలు మృతి చెందగా మరో గొర్రె తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకొంది. తవళం పంచాయతి చౌకిళ్లవారిపల్లికు చెందిన గోదాల రెడ్డెప్ప రోజూ మాదిరిగానే తన గొర్రెలను మేతకు తోలుకొని వెళ్లాడు. ఈ క్రమంలో తవళం రోడ్డు దాటుతుండగా నిమ్మనపల్లి నుంచి కుమ్మరపల్లికు ద్విచక్రవాహనంలో వస్తున్న శేఖర(27) అతి వేగంగా వచ్చి గొర్రెలపై వెళ్లడంతో రెండు గొర్రెలు అక్కడ కక్కడే మృత్యువాత పడాయని మరో గొర్రె కాలుకు తీవ్ర గాయమైట్లు కాపరి తెలిపాడు, తనకు న్యాయం చేయాలని అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పనులు చేయకపోతే ఇంటికి వెళ్లిపోండి

● హౌసింగ్ అధికారులపై డీఈ ఆగ్రహం

నిమ్మనపల్లి జనవరి 30(ఆంధ్రజ్యో తి): మండలంలో చేపట్టిన ప్రభుత్వ గృహ నిర్మాణాలలో నిమ్మనపల్లి వెనుకబడి ఉండడంతో పనులు చేయకపోతే ఇంటికి వెళ్లిపోండి అం టూ హౌసింగ్ అధికారులు, ఇంజ నీరింగ్ అసిస్టెంట్లపై డీఈ రమేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువా రం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వారానికి ఒక్క ఇళ్లు కూడా ప్రొగ్రెస్ చేయ కపోతే మీరు పనితీరు ఎలా వుందో తెలుస్తోందని ఇలా అయితే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఇది ఇలాగే కొనసాగితే అందరికీ నోటీసులు జారీ చేయన్నున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 2078 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 1626ఇళ్ల నిర్మాణాలు చేశారని మిగిలిన వాటిలో 452 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయని వాటిలో ఇళ్లు నిర్మించుకోలేని 13మందికి ఇళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. మిగిలిన 439 ఇళ్లను సిబ్బంది నిర్లక్ష్యం వలన పూర్తి చేయలేదని తెలిపారు. ముఖ్యంగా ఐహెచ్‌ఎల్ అంటే మరుగుదొడ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఇచ్చిన తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అమరనాధ్. సిబ్బంది పాల్గొన్నారు.

ఉడ్‌బాల్ చాంపియన్‌గా మదనపల్లె విద్యార్థులు

మదనపల్లె టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉడ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు దక్షిణాది రాష్ట్రాల మధ్య నిర్వహించిన సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో మదనపల్లెకు చెందిన శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. ఈనెల 28, 29 తేదీల్లో కర్నూల్‌లోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన సౌత్‌జోన్ ఉడ్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పురుషుల విభాగం ఫైనల్స్‌లో తెలంగాణా జట్టుపై ఆంధ్ర జట్టు, మహిళల విభాగంలో తమిళనాడు జట్టుపై ఆంధ్ర జట్టు విజయం సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కించుకున్నారని రాష్ట్ర ఉడ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.ప్రభాకర్ ప్రకటించారు. ఈ క్రమంలో గురువారం మదనపల్లెకు చేరుకున్న ఆంధ్ర జట్టు సభ్యులను జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సి పాల్ రాఘవేంద్ర అభినందించారు. అలాగే ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్‌జిల్లా కబడ్డీ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు పోటీ చేసి తృతీయస్థానం దక్కించుకుంది. ఈ జట్టులో జ్ఞానాంబిక విద్యార్థినులు శిరీషా, కావేరి పాల్గొన్నారని కరెస్పాండెంట్ ఆర్. గురుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు శరత్‌నాయక్, జగదీష్ పాల్గొన్నారు.

హెల్మెట్ల వాడకంపై అవగాహన ర్యాలీ

మదనపల్లె అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మహిళా పోలీసుల స్కూటర్ ర్యాలీని మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ వాహనాలను నడపాలని వాహనదారులకు సూచించారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదన్నారు. ఎదరుగావచ్చే వాహనదారులను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐలు రామచంద్ర, ఎరిసావల్లి, కళా వెంకటరమణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలి



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం సుబ్బారెడ్డి తదితరులు



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



పీలేరులో మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య, వాసవీ, వాసవీ కపుల్స్ మానవత సంస్థ సభ్యులు

మదనపల్లె టౌన్/అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ జాతిపిత మహాత్మగాంధీ అడుగుజాడల్లో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. గురువారం టౌన్‌బ్యాంకు ఛైర్మన్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడెంసిద్దప్ప, బాలుస్వామి, నీలకంఠ, తదితరులు పాల్గొన్నారు. జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్, రఫీ పాల్గొన్నారు.

పీలేరులో: పీలేరులోని పలు సంఘాలు గురువారం మహాత్మగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బలసా వేణుగోపాల్, సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, సీఆర్ రాజేశ్, ఎర్రయ్యశెట్టి, సుబ్బన్న, నాగరాజ, ప్రకాశ్, ఫణి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు గోవర్దన్, సభ్యులు సుమంత్, కృష్ణమూర్తి, జయ, అశోక్, వాసవీ కపుల్స్ అధ్యక్షుడు శంకర, సభ్యులు అరవింద్, సుమంత్, అనిల్, రాజు, సురేశ్, మాన వత సంస్థ అధ్యక్షుడు రామచంద్ర, సభ్యులు రాచపల్లె కృష్ణమూర్తి, పోతంశెట్టి రమేశ్, రహత్ బాషా, అక్రమ్ బాషా, శెట్టి సుబ్రహ్మణ్యం, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి కూటమి పార్టీల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాలలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షులు బొక్కసం రామకృష్ణ, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, బీజేపీ మాజీ ఎంపీపీ సురేంద్రవర్మ, నాయకులు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, చంద్రమౌళి, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్, తెలుగు యువత చాను, ఆనంద, తుంబూరి వెంకటరమణ, ఆదినారాయణ, రెడ్డిరామ్, యూసుఫ్, కలందర్, తదితర కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

ముందస్తు సమాచారం లేకుండానే సమావేశమా?

పెద్దతిప్పసముద్రం జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు సమాచారం లేకుండానే ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం ఎలా నిర్వహిస్తారని ఆ సంఘనాయకులు ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రమైన పీటీఎంలో రెవెన్యూ అధికారులు కనీస సమాచారం అందించకుండా మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారని వారు ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాల నాయకులకు సైతం సమాచారం అందించకుండా సమస్యలను ప్రస్తావించకుండా సమావేశాన్ని ముగించేశారన్నారు. రెవన్యూ అధికారులు, మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి నాయకులు వివక్ష చూపుతున్నారని, మండల స్థాయి అధికారులు తమకు కనీస గౌరవం ఇవ్వకుండా తమపై చిన్న చూపు చూపుతున్నారని మండిపడుతున్నారు. ఇకనైనా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశాలు అందరిని కలుపుకుని, అందిరితో చర్చించి సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులందరి సమక్షంలో నిర్వహించాలని, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఈ సమావేశంలో లక్ష్మినారాయణ, కాట్నగల్లు రమణ, టి. సదుం కదిరప్పలు పాల్గొన్నారు.

దళిత హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిమ్మనపల్లి జనవరి 30(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచవేటి వారిపల్లి పంచాయతి గుడ్లపల్లిలో రెవెన్యూ అధికారులు ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘ నాయకులు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో రోడ్లు, మురుగునీటి కాలువలు, విద్యుద్దీపాలు లేవని అధికారులకు తెలిపారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ దళితవాడలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, సీఎస్ డీటీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలకు 46 యూనిట్లు మంజూరు

కలికిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ కులాలకు బీసీ కార్పొరేషన్ ద్వారా 46 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో భానుమూర్తి రావు తెలిపారు. వారికి ఆయా బ్యాంకులు రుణం ఇవ్వడంతోపాటు బీసీ కార్పొరేషన్ సబ్సిడీ కల్పించిందని చెప్పారు. చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా 11 మందికి, స్వయం ఉపాధి ద్వారా ఐదుగురు ఈబీసీలకు, ఓబీఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కోసం మరో 30 మందికి రుణాలు మంజూరవుతాయని చెప్పారు. ఇందులో స్థానిక గ్రామీణ బ్యాంకు 25 యూనిట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడాకు 12, ఎస్‌బీఐకు 9 యూనిట్లు కేటాయించామన్నారు. ఈబీసీ కేటగిరీలో 1, రెడ్డి కులానికి 2, ఆర్యవైశ్యులకు 1, కమ్మ కులానికి 1 యూనిట్లు వంతున కేటాయించారని చెప్పారు. 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల లోగా ఉన్న బీసీ కులాల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హతలు కలిగినవారు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైటు ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఫిబ్రవరి 7వ తేదీ లోగా దరఖాస్తులు పంపుకోవాలన్నారు. కాగా ఐదేళ్ల తరువాత బీసీ కార్పొరేషన్ రుణాలు విడుదల కావడం పట్ల పలు బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే ప్రభుత్వ సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తంబళ్లపల్లె మండలానికి 51 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. బీసీ-ఏకు 9 యూనిట్లు, బీసీ-బీకి 9 , బీసీ-డీకి 10, బీసీ-ఈకి 7, ఈబీసీకి-2, కాపులకు 10, రెడ్డి-2, కమ్మ, ఆర్యవైశ్యులకు ఒక్కో యూనిట్ మంజూరైనట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులన్నారు. అర్హులైన వారు ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ లోపు ఏపీవోబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ప్రక్రియ అనంతరం 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారికి బ్యాంక్ అకౌంట్‌లో ప్రభుత్వం సబ్సిడీ నిధులను జమ చేస్తుందన్నారు.

సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేయండి

బి.కొత్తకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని చిత్తశుద్ధితో పక్కాగా అమలు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ బి.కొత్తకోట ఎంపీడీవోను ఆదేశించారు. గురువారం మండలపరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోకులంషెడ్ల నిర్మాణం, సీసీరోడ్లు, ఉపాధిహామీ పనులు, పక్కాగృహాల నిర్మాణం తదితర అంశాలపై ఆరా తీశారు. వాటిపై వివరాలను ఎంపీడీవో ఆయనకు వివరించారు. 1న పింఛన్ల పంపిణీ వందశాతం పూర్తిచేయడానికి ప్రయత్నించాలని సీఈవో ఆదేశిస్తూ, తాగునీటి సమస్యపై తక్షణం స్పందించాలన్నారు.

కస్తూర్బా గురుకుల పాఠశాల తనిఖీ

పెద్దమండ్యం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) మండలంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలను గురువారం ఎంఈవోలు మనోహర్, రామకృష్ణలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాలు, తరగతుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. డీఈవో సుబ్రమణ్యం ఆదేశాల మేరకు కస్తూర్బా పాఠశాలను సందర్శించినట్లు అధికారులు తెలిపారు. హెచ్‌ఎంలు రామచంద్రా, రషీదాబాను, ప్రిన్సిపాల్ రాణికుమారి పాల్గొన్నారు.